## హనూరులో 13.45శాతం పోలింగ్

బెంగళూరు, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): తమ గ్రామంలో మౌలిక సదుపాయాలు లేవని చామరాజనగర లోక్‌సభ స్థానం పరిధిలోని హనూరులో గ్రామస్థులు ఎన్నికలు బహిష్కరించిన సంగతి తెలిసిందే. సోమవారం జరిగిన రీపోలింగ్‌లోనూ గ్రామస్థులు పట్టువీడలేదు. 528మంది ఓటర్లలో 279మంది పురుషులు, 249మంది మహిళలు ఉన్నారు. ఉదయం 7 గంటలనుంచి సాయంత్రం 6 వరకు పోలింగ్ సాగినా.. 71మంది మాత్రమే ఓటు హక్కును వినియోగించుకున్నారు. మొత్తానికి 13.45 శాతం పోలింగ్ నమోదైనట్లు రాష్ట్ర ఎన్నికల అధికారులు ప్రకటించారు.



బాగల్కోటె సభలో ప్రధానిని సత్కరిస్తున్న బీజేపీ నేతలు

## టెక్కీ నగరాన్ని..ట్యాంకర్ హబ్‌గా మార్చారు



ప్రజలకు మోదీ అభివాదం

- కాంగ్రెస్ బెంగళూరును భ్రష్టు పట్టించింది
- బాగల్కోటె ప్రచారసభలో ప్రధాని మోదీ

బెంగళూరు, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా టెక్కీ హబ్‌గా పేరొందిన బెంగళూరును కాంగ్రెస్ ప్రభుత్వం ట్యాంకర్ హబ్‌గా మార్చారని ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఎద్దేవా చేశారు. విజయసంకల్ప యాత్రలో భాగంగా బాగల్కోటె అభ్యర్థి పీసీ గద్దిగౌడర్ తరపున సోమవారం ఎన్నికల ప్రచారసభ నిర్వహించారు. ఈ సభలో ప్రసంగించిన ప్రధాని రవాణా సౌలభ్యాలు మెరుగు అభివృద్ధికి సంకేతమన్నారు. రోడ్డు, విమానయాన మార్గాల ప్రగతితో దేశాన్ని అభివృద్ధి పథంలో నడిపించామన్నారు. కర్ణాటకలోనే పలు విమానాశ్రయాలు ఏర్పాటయ్యాయన్నారు. రాష్ట్రంలో వందేభారత్ రైళ్లు పరుగులు పెడుతున్నాయని గుర్తు చేశారు. కర్ణాటకలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏటీఎంగా మార్చుకుందన్నారు. ఇక్కడ తక్కువ వ్యవధిలోనే కనీసం ప్రభుత్వ ఉద్యోగులకు జీతాలు ఇచ్చే పరిస్థితి కూడా లేకుండా పోయిందన్నారు. దేశంలో పదేళ్లక్రితందాకా 18వేల గ్రామాలకు కనీసం విద్యుత్ సదుపాయం లేకుండా పోయిందని అన్ని గ్రామాలకు కరెంటు వచ్చేలా చేశామన్నారు. నీటి సమస్య పరిష్కారం కోసం జలజీవన్ మిషన్ పథకాన్ని అమలు చేశామన్నారు. దేశంలో 75శాతం సుమారు 11కోట్ల ఇళ్లకు కొళాయిలు ఏర్పాటు చేశామన్నారు. గతంలో కేవలం ఇది కేవలం 16శాతం ఉండేదన్నారు. కాంగ్రెస్‌కు పేదలు, దళితుల గురించి ఆలోచించే సమయం లేదన్నారు. ప్రస్తుతం అభివృద్ధి అంటే ఏమిటో దేశమంతటా మారుమూల గ్రామాల్లో సైతం చూపామన్నారు. కాంగ్రెస్ ముస్లింలకు ఓబీసీ రిజర్వేషన్ కల్పించిందన్నారు. ఇటువంటి కుట్రలకు మోదీ అవకాశం ఇవ్వరన్నారు. ప్రతిపక్షాలు ఏఐ టెక్నాలజీతో నా వాయిస్‌ను నకిలీ చేసి ప్రచారం చేస్తున్నారన్నారు. రాష్ట్రంలో శాంతిభద్రతలు దారి తప్పాయని హుబ్బళ్లిలో విద్యార్థినిని కళాశాల క్యాంపస్‌లోనే కిరాతకంగా హతమార్చారన్నారు. హనుమాన్ చాలీసా పఠిస్తే బెంగళూరులో ఓ దుకాణదారుడిని చితకబాదారన్నారు. కెఫెలో బాంబు పేలుతుందని ఇదంతా ఉగ్రవాద మానసిక స్థితికి నిదర్శనమన్నారు. కాంగ్రెస్ పార్టీ ఓట్లకోసం ఇటువంటివారిని ప్రోత్సహిస్తున్నారన్నారు. దేశంలో సామాన్య ప్రజలను హత్యలు చేసేవారిని చూస్తూ ఊరుకోమన్నారు. వికసిత కర్ణాటక - వికసిత భారత్‌కోసం బీజేపీ అభ్యర్థిని గెలిపించాలన్నారు. భారత్ నైపుణ్యదేశంగా, ఉత్పత్తి హబ్‌గా మార్పు చేసేందుకు వ్యూహాలు వేశామన్నారు. సభలో కేంద్రమాజీ మంత్రి శ్రీనివాసప్రసాద్ మృతి పట్ల ప్రధాని మోదీ తీవ్ర విచారం వ్యక్తం చేశారు. మాజీ సీఎం యడియూరప్ప, బీజేపీ అధ్యక్షుడు విజయేంద్ర, అభ్యర్థి రమేశ్ జిగజిణగి, మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు భాగస్వామ్యులయ్యారు.

### కాంగ్రెస్ నిర్లక్ష్యంతోనే తాగునీటి సమస్య

ప్రపంచం గుర్తించే టెక్ హబ్‌గా బెంగళూరుకు పేరుందని అయితే ఇటీవల ట్యాంకర్‌హబ్‌గా మారిందని ప్రధాని మోదీ పేర్కొన్నారు. ఓ కన్నడ చానెల్‌తో ప్రధాని ప్రత్యేకంగా మాట్లాడారు. కర్ణాటకలోని కాంగ్రెస్ ప్రభుత్వం అన్నింటా ఏడాదిలోపే విఫలం చెందిందన్నారు. ఆ పార్టీ నిర్లక్ష్యంతోనే తాగునీటి సమస్య ఏర్పడిందన్నారు. రాష్ట్రప్రజలు ఎందుకు కాంగ్రెస్‌ను గెలిపించామనే పశ్చాత్తాపంలో ఉన్నారన్నారు. టెక్ హబ్‌గా పేరొందిన బెంగళూరు రోడ్లపై నీటి ట్యాంకర్‌లు తిరుగుతున్నాయన్నారు. రాష్ట్రంలో ఆర్థిక పరిస్థితి దివాళా తీసిందన్నారు. పెద్ద హామీలను ఇస్తున్నారన్నారు. కాంగ్రెస్‌కు ఓటు వేస్తేనే గ్యారెంటీలు ఉంటాయని ప్రచారం చేస్తున్నారన్నారు. దీని అర్థం ప్రజలను మోసం చేయడం కాదా అని ప్రశ్నించారు. కాంగ్రెస్ రైతు పథకాలను రద్దు చేశారని దానికి ప్రత్యేకమైన కారణాలు లేవన్నారు. రాష్ట్రంలో సీఎం హోదా లాంటి పరిష్కారం కాని సమస్యలు ఉన్నాయన్నారు. సీఎంగా ప్రమాణస్వీకారం చేసినా నిమ్మైన సీఎం ఎవరనేది అర్థం కావడం లేదన్నారు. మేమే సీఎం అకునేవారు చాలామంది ఉన్నారన్నారు. యువతకు స్కాలర్‌షిప్‌ల విషయంలో అన్యాయం చేశారన్నారు. ఇటువంటి తప్పుడు నిర్ణయాలు తీసుకుంటున్నారని మండిపడ్డారు.



## బలహీన వర్గాల ఆశాజ్యోతి..!

- 50ఏళ్ల రాజకీయ జీవితంలో తిరుగులేని నాయకుడు శ్రీనివాస ప్రసాద్
- అనారోగ్యంతో కన్నుమూసిన సీనియర్ నేత
- ఆరుసార్లు ఎంపీగా, రెండుసార్లు ఎమ్మెల్యేగా..
- కేంద్రం, రాష్ట్రంలో మంత్రిగా సేవలు..
- ఇటీవలే రిటైర్మెంట్
- సంతాపం తెలిపిన ప్రముఖులు
- నేడు అంత్యక్రియలు



బెంగళూరు, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): ఆయన సాధారణ నాయకుడుకాదు.. ఏకంగా 50 ఏళ్లపాటు దేశ, రాష్ట్ర రాజకీయాల్లో ఖ్యాతి గడించారు. సీనియర్ నాయకులు, బడుగు బలహీనవర్గాల ఆశాజ్యోతిగా పేరొందిన మైసూరు ప్రాంత నేత వీ శ్రీనివాసప్రసాద్ (76) ఇక లేరు. సుదీర్ఘకాలంగా వయోభారంతో పాటు కిడ్నీ సమస్యలు ఎదుర్కొంటున్న ఆయన ఆరోగ్యంలో మార్పులు రావడంతో మూడు రోజులక్రిందట బెంగళూరులోని ఓ ప్రముఖ ఆసుపత్రిలో చేర్పించారు. ఆదివారం రాత్రి 1.20 గంటలకు గుండెపోటు రావడంతో శ్రీనివాసప్రసాద్ తుదిశ్వాస వీడారు.

- వెంకటయ్య శ్రీనివాసప్రసాద్ మైసూరులోని అశోకపురంలో వెంకటయ్య, భాగ్యలక్ష్మి దంపతులకు 1947 ఆగస్టు 6న జన్మించారు. ఆయనకు భార్య భాగ్యలక్ష్మి, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. వీరిలో ప్రతిమాప్రసాద్ ఐఆర్ఎస్ అధికారి కాగా, ఆమె భర్త దేవరాజ్ కూడా ఐఆర్ఎస్ అధికారి. రెండో కుమార్తె పూర్ణిమా ప్రసాద్ మాజీ ఎమ్మెల్యే హర్షవర్ధన్ భార్య, మూడో కుమార్తె పూనమ్ ప్రసాద్ ప్రముఖ ఆర్థోవైద్యులు డాక్టర్ మోహన్ భార్య.
- పొలిటికల్ సైన్స్‌లో ఎంఏ పూర్తి చేసిన శ్రీనివాసప్రసాద్ 1974లో రాజకీయాల్లోకి ప్రవేశించారు. మైసూరు కృష్ణరాజ నియోజకవర్గ ఉప ఎన్నికల్లో పోటీ చేసి ఓటమి చెందారు. 1978లో టీ నరసీపుర ఎమ్మెల్యే స్థానానికి పోటీ చేసి అక్కడా ఓడిపోయారు. 1980లో చామరాజనగ లోక్‌సభ కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసి గెలుపొందారు. ఆ తర్వాత 1984, 1989, 1991ల్లో కాంగ్రెస్ నుంచి విజయం సాధించారు. 1999లో జేడీయూ నుంచి, 2019లో బీజేపీ నుంచి గెలుపు సాధించారు. ఇక 1999లో వాజ్‌పేయ్ కేబినెట్‌లో పౌర ఆహార సరఫరాలశాఖ మంత్రిగా వ్యవహరించారు. 2008, 2013 శాసనసభ ఎన్నికల్లో నంజనగూడు నుంచి గెలుపొందారు. సిద్దరామయ్య కేబినెట్‌లో రెవెన్యూ శాఖ మంత్రిగానూ వ్యవహరించారు. అవివాహిత మహిళలకు పించన్ తీసుకొచ్చే 'మనస్విని' పథకాన్ని అమలు చేసిన ఘనత శ్రీనివాస ప్రసాద్‌కే దక్కుతుంది. 2017లో మంత్రివర్గ విస్తరణ వేళ శ్రీనివాసప్రసాద్‌ను పక్కనపెట్టడంతో అప్పటి సీఎం సిద్దరామయ్యపై ఆగ్రహంతో ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసి కాంగ్రెస్‌ను వీడారు. 2018 ఉప ఎన్నికల్లో బీజేపీ నుంచి పోటీ చేసి ఓడిపోయారు. 2019లో చామరాజనగర లోక్‌సభ అభ్యర్థిగా గెలుపు సాధించారు. ఆయన రాజకీయ జీవనమంతా చామరాజనగర జిల్లాకు అనుబంధంగానే సాగింది. రాజకీయాల్లోకి ప్రవేశించి 50ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా ఇటీవల మార్చి 17న సువర్ణ మహోత్సవాన్ని జరుపుకొని రాజకీయాలను వీడుతున్నట్లు ప్రకటించారు. ఇటీవల ఎన్నికల్లో పోటీ చేయాలని కాంగ్రెస్, బీజేపీలు తీవ్రంగా ప్రయత్నించాయి. ఒకప్పటి ద్వేషాన్ని వీడి సీఎం సిద్దరామయ్య నేరుగా శ్రీనివాసప్రసాద్ ఇంటికి వెళ్లి మద్దతు కోరారు. అయితే రాజకీయాలు వీడుతున్నట్లు ప్రకటించాక ఎవరికీ మద్దతు ఇచ్చేది లేదని తిరస్కరించారు. ఇటీవల మాజీ సీఎం యడియూరప్ప ఆయన ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు.

### నేడు అంత్యక్రియలు

ఎంపీ శ్రీనివాసప్రసాద్ భౌతికకాయాన్ని జయలక్ష్మీపురంలోని ఆయన నివాసం వద్ద ఉంచారు. మధ్యాహ్నం 1 గంట తర్వాత అశోకపురంలోని ఎంటీఎం పాఠశాల ప్రాంగణంలో పార్థివదేహాన్ని ఉంచారు. సీఎం సిద్దరామయ్య, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు విజయేంద్రలు సందర్శించి నివాళి అర్పించారు. మంగళవారం అశోకపురం నుంచి ఊరేగింపుగా తీసుకెళ్లి సిల్క్‌ఫ్యాక్టరీ వద్ద ఉండే అంబేడ్కర్ కల్చరల్ ట్రస్టు ఆధ్వర్యంలో అంత్యక్రియలు జరపనున్నారు. శ్రీనివాసప్రసాద్ బౌద్ధమతాన్ని స్వీకరించిన మేరకు బౌద్ధ సంప్రదాయాలతోనే అంత్యక్రియలు ఉంటాయని ఆయన కుమార్తె ప్రతిమా ప్రసాద్ తెలిపారు.

### రాష్ట్రానికి ఒక శక్తి: డీసీఎం

సమాజంలో అట్టడుగు వర్గాలకోసం నిరంతరంగా పటు పడ్డ నేత శ్రీనివాస ప్రసాద్ అని డీసీఎం డీకే శివకుమార్ అభిప్రాయపడ్డారు. రాష్ట్రానికి ఒక శక్తిలాంటివారన్నారు. మాజీ ప్రధాని దేవెగౌడ స్పందిస్తూ 50ఏళ్లకుపైగా రాజకీయాల్లో కలసి పయనించామన్నారు. పార్టీలు వేరైనా వ్యక్తిగతంగాను నైతిక విలువలకు ప్రాధాన్యం ఇచ్చిన శ్రీనివాసప్రసాద్ లేకపోవడం బాధాకరమన్నారు. మాజీ సీఎం యడియూరప్ప మాట్లాడుతూ ఓ మంచి మిత్రుడిని కోల్పోయామన్నారు. రాజకీయాల్లో విలువలకు ప్రాధాన్యం ఇచ్చారని శ్రీనివాసప్రసాద్‌ను గుర్తు చేసుకున్నారు. మాజీ సీఎం కుమారస్వామి శివమొగ్గలో మాట్లాడుతూ ఐదు దశాబ్దాలుగా రాజకీయాల్లో కొనసాగిన మేధావి శ్రీనివాసప్రసాద్ రాష్ట్రం కోసం, అట్టడుగు వర్గాలకోసం ఆయన అనునిత్యం కృషి చేశారన్నారు. బీజేపీ అధ్యక్షుడు విజయేంద్ర మాట్లాడుతూ ఐదు దశాబ్దాలు రాజకీయాల్లో కొనసాగినా ఒక మచ్చలేకుండా సౌమ్యుడిగా పేదలపాలిట ఒక శక్తిగా రాణించారన్నారు. కేంద్రమంత్రి ప్రహ్లాద్‌జోషి మాట్లాడుతూ శ్రీనివాసప్రసాద్ అకాలమరణం ద్వారా రాష్ట్రంలో ఒక రాజకీయశక్తి దూరమైందని విచారంవ్యక్తం చేశారు.

### వెనుకబడినవర్గాలకు శక్తినిచ్చారు: సీఎం

దళితులు, వెనుకబడిన వర్గాలకు శ్రీనివాసప్రసాద్ శక్తిని ఇచ్చారని సీఎం సిద్దరామయ్య అభిప్రాయపడ్డారు. ఆయన మృతి తనకు తీవ్ర ఆవేదన కలిగించిందన్నారు. అన్యాయం, అసమానతకు వ్యతిరేకంగా జీవికాలం పోరాటం చేసిన ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. సామాజిక న్యాయం విషయంలో ఆయన నిరంతరం పాటుపడ్డారన్నారు. కేంద్ర, రాష్ట్ర రాజకీయాల్లో ఆయనది చెరగని ముద్ర అన్నారు. మైసూరు ప్రాంతంలో తాము ఇద్దరం కలసి, వేర్వేరు పార్టీలలో కొనసాగినా పరస్పర గౌరవసంబంధాలు కొనసాగాయన్నారు. ఆయన ఆత్మకు శాంతి కలగాలన్నారు.



ఎంపీ శ్రీనివాసప్రసాద్ చిత్రపటానికి సీఎం నివాళులు

## నేడు ప్రజ్వల్ రేవణ్ణపై సస్పెన్షన్ వేటు..!

- కోర్ కమిటీలో తీర్మానం



బెంగళూరు, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): రాసలీలల వ్యవహారంలో ఇరుక్కున్న హాసన్ ఎంపీ ప్రజ్వల్‌పై పార్టీ వేటు వేయనుంది. మంగళవారం జరిగే జేడీఎస్ కోర్ కమిటీ సమావేశంలో నిర్ణయం తీసుకోనున్నట్లు తెలుస్తోంది. పార్టీవర్గాలు వెల్లడించిన సమాచారం మేరకు పార్టీ ముఖ్యమా..? ప్రజ్వల్ ముఖ్యమా..? అంటూ ఇద్దరు ఎమ్మెల్యేలు పార్టీ జాతీయ అధ్యక్షుడు దేవెగౌడ, కుమారస్వామిని ప్రశ్నించడం సర్వత్రా చర్చనీయాంశం అవుతోంది. కుమారస్వామి సైతం ప్రజ్వల్ పట్ల కఠినంగానే వ్యాఖ్యానించారు. తప్పు చేసి ఉండుంటే శిక్ష పడాల్సిందేనని, చట్ట ప్రకారం అతడిపై చర్యలు ఉంటాయన్నారు. కోర్ కమిటీలో ప్రజ్వల్‌పై వేటు వేయాలనే నిర్ణయం ఇప్పటికే తీసుకున్నట్లు తెలుస్తోంది. ఆదివారం రాత్రి కుమారస్వామి, దేవెగౌడ ఇదే విషయమై చర్చించుకున్నట్లు సమాచారం. ప్రజ్వల్‌పై వేటు వేయడం ద్వారా పార్టీపై ఒత్తిడిని తగ్గించుకోవచ్చని భావిస్తున్నారు. ఇక బీజేపీ ప్రతిపక్షనేత అశోక్ స్పందిస్తూ ప్రజ్వల్ వివాదంలో కుమారస్వామి తీసుకునే నిర్ణయమే అంతిమమనీ, అందుకు తాము కట్టుబడతామన్నారు. కాగా పెన్‌డ్రైవ్‌ల అంశం బయటకు రావడంతో డీసీఎం డీకే శివకుమార్ స్పందిస్తూ.. ఒకప్పుడు బదిలీల అవినీతికి సంబంధించి పెన్‌డ్రైవ్ ఉందని కుమారస్వామి వ్యాఖ్యలను తిప్పికొట్టారు. బహుశా పెన్‌డ్రైవ్‌లు ఇవే ఉండవచ్చుననే వ్యాఖ్యలపై కుమారస్వామి స్పందించారు. రాష్ట్రంలో కొందరు పెన్‌డ్రైవ్ ఎక్స్‌పర్ట్‌లు ఉన్నారని అది అందరికీ తెలుస్తుందని ఎద్దేవా చేశారు. కీలకమైన ఎన్నికల వేళ జేడీఎస్‌లో తమ వారసుడి ప్రతిష్టకు భంగం కలగడంపై దేవెగౌడ కుటుంబంలో కలవరం రేగినట్లు తెలుస్తోంది.

## శ్రీమంతులకే రుణమాఫీ



ఖర్గే

- రూ.16లక్షల కోట్లు దోచిపెట్టారు
- అన్నదాతకు అందని సాయం
- కాంగ్రెస్‌ను తిట్టడం మాని రాష్ట్రానికి ఏం చేశారో చెప్పండి
- మోదీపై ప్రియాంకా గాంధీ ధ్వజం



ప్రసంగిస్తున్న ప్రియాంకా గాంధీ

బెంగళూరు, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి): ఎండనక, వాననక కష్టపడి సాగు చేసి అందరికీ అన్నం పెట్టే అన్నదాతకు సాయం చేయరు కానీ, శ్రీమంతులకు రూ.16 లక్షల కోట్ల రూపాయలు ప్రధాని మోదీ మాఫీ చేశారని కాంగ్రెస్ అగ్రనేత్రి ప్రియాంకగాంధీ మండిపడ్డారు. కలబురగి జిల్లా సేడంలో సోమవారం ఎన్నికల ప్రచారసభలో ప్రియాంకగాంధీ మాట్లాడుతూ ఇది బసవణ్ణ నడయాడిన నేల, పవిత్ర భూమి అని, మల్లికార్జున ఖర్గే ఎన్నో ఏళ్లపాటు ప్రజాప్రతినిధిగా కొనసాగిన గడ్డ అన్నారు. దేశంలో సత్యమేవజయతే నినాదం ప్రముఖమైనదని, దీనినే కాంగ్రెస్ ఇదే విధానం కాంగ్రెస్ అమలు చేసిందన్నారు. కానీ ఇటీవలి ఐదేళ్లలో కలబురగి ఎంపీ రైళ్లను తీసుకురావడం తప్ప ఎలాంటి అభివృద్ధి చేయలేదన్నారు. తాగునీటికి సైతం స్థానికులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. దేశంలో నిరుద్యోగం తాండవిస్తోందన్నారు. యువత సైన్యంలో చేరేందుకు ఉత్సాహంగా ఉన్నా అగ్నివీర్ తీసుకొచ్చి ఎటువంటి భరోసా ఇవ్వలేదన్నారు. నిత్యావసరాల వస్తువుల ధరలు పెరిగి మధ్యతరగతి, బీపీఎల్ కుటుంబాలు ఇబ్బందులో ఉన్నారన్నారు. దేశం ఎటువైపు పరుగులు తీస్తోందో బీజేపీ నేతలే చెప్పాలంటూ ఎద్దేవా చేశారు. ఇద్దరు సీఎంలను జైళ్లకు పంపారని, అయినా మీడియా కూడా ప్రస్తావించడం లేదన్నారు. అందుకు ప్రధాన కారణం అత్యధిక మీడియా సంస్థలు శ్రీమంతులకు చెందినవేనన్నారు. తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి ఇంటికి ఢిల్లీ పోలీసులు వచ్చిన విషయం మీడియా ప్రశ్నించదన్నారు. మోదీ మరోసారి అధికారంలోకి వస్తే రాజ్యాంగం బదులు సామాన్య ప్రజల అధికారమే పోతుందన్నారు. కోలి సామాజికవర్గాన్ని ఎస్టీలో చేర్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి ప్రస్తావన పంపితే తిరస్కరించారని మండిపడ్డారు. ఒలింపిక్స్ క్రీడాకారులకు వేధింపులు కొనసాగుతున్నాయని మహిళలపై అత్యాచారాలు జరుగుతున్నా పట్టించుకోవడం లేదన్నారు. కర్ణాటకలో బీజేపీ మైత్రి, జేడీఎస్ ఎంపీ ఎంతోమంది మహిళలపై దౌర్జన్యం చేశారని, అతడికి మద్దతుగా ప్రచారం చేసిన ప్రధాని మోదీ, అమిత్‌షాలు సమాధానం చెప్పాలన్నారు. జేడీఎస్ నేత రాత్రికి రాత్రి విదేశాలకు పరారీ అయ్యారన్నారు. మంగళసూత్రం గురించి మాట్లాడే మోదీ ఈ అంశంపై ఏం సమాధానం చెబుతారని ప్రశ్నించారు. డీఆర్‌డీఓ, ఇస్రో, ఐఐటీలు కాంగ్రెస్ పాలనలో వచ్చినవని, మోదీ ఇలాంటిసంస్థలు తీసుకొచ్చారా అంటూ ప్రశ్నించారు. 50ఏళ్లుగా మీ సేవ చేస్తున్న ఖర్గే కుటుంబాన్ని ఆశీర్వదించాలని కోరారు.

### కాంగ్రెస్‌ని దూషించడమే మోదీ పని

ప్రధానమంత్రి నరేంద్రమోదీ నిత్యం కాంగ్రెస్ పార్టీని దూషించడమే ఎన్నికల ప్రచారంగా చేసుకున్నారని రాష్ట్రానికి ఏం చేశారో వివరిస్తే బాగుంటుందని ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే డిమాండ్ చేశారు. ఇందిరాగాంధీ నుంచి రాహుల్‌గాంధీ దాకా అందరినీ తిడుతుంటారని, రాష్ట్రానికి ఏం చేశారనేది చెప్పకుండానే సభలు జరుపుతారని ప్రశ్నించారు. ఆర్టికల్ 371జే అమలుకు 330మంది సభ్యుల అవసరం కాగా అందరినీ వ్యక్తిగతంగా కలసి సాధించానన్నారు. రాష్ట్రప్రభుత్వం 5 గ్యారెంటీలతో ప్రతి కుటుంబానికి న్యాయం జరుగుతోందన్నారు. 50ఏళ్లలో కాంగ్రెస్ ఏం చేసిందని ప్రధాని మోదీ ప్రశ్నిస్తారన్నారు. స్వాతంత్ర్యానంతరం నెహ్రూ ప్రజాస్వామ్య వ్యవస్థను, అంబేడ్కర్ రాజ్యాంగాన్ని తీసుకురాకుంటే మీరు ప్రధాని కాలేరని అమిత్ షా హోం మంత్రి అయ్యేవారు కాదన్నారు.

### బీజేపీకి 400 సీట్లు వస్తే రిజర్వేషన్లు రద్దు

- తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి



బెంగళూరు, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి): బీజేపీకి 400 సీట్లు వస్తే ఎస్సీ, ఎస్టీ, బీసీల రిజర్వేషన్లు రద్దు చేస్తారని, ప్రతి వ్యక్తి కాంగ్రెస్‌కు ఓటు వేయడం ద్వారా బీజేపీ కుట్రలను తిప్పికొట్టాలని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి డిమాండ్ పిలుపునిచ్చారు. కలబురగి జిల్లా సేడంలో ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే అల్లుడు రాధాకృష్ణ దొడ్డమని కోసం ఎన్నికల ప్రచారసభలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ కేంద్రం నుంచి కరువు పరిహారంలో నిర్లక్ష్యం చేయడంతో సీఎం సిద్దరామయ్య సుప్రీంకోర్టును ఆశ్రయించాల్సి వచ్చిందన్నారు. సోషల్‌మీడియాలో పోస్ట్ చేసినందుకు ఢిల్లీ పోలీసులు నా ఇంటికి నోటీసులు ఇచ్చేందుకు వచ్చినట్లు తెలుస్తోందన్నారు. ప్రధాన మంత్రి మోదీ ఇప్పటివరకు ఐటీ, ఈడీ, సీబీఐ అధికారులను పంపారని, ఇప్పుడు ఢిల్లీ పోలీసులను పంపారని ఇటువంటివారికి బెదిరేది లేదన్నారు. బీజేపీకి ప్రజలు మద్దతు ఇస్తే రానున్న రోజుల్లో రిజర్వేషన్‌లు ఉండవన్నారు. కర్ణాటకలో 28 స్థానాల్లోనూ కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించాలన్నారు.

- వైద్యవిద్యాశాఖ మంత్రి శరణ ప్రకాశ్ పాటిల్ మాట్లాడుతూ కేంద్రప్రభుత్వం సహకరించకపోవడంతో అన్నభాగ్య పథకం అమలులోనూ ఆటంకాలు ఎదురయ్యాయన్నారు. అయినా కూడా రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యామ్నాయంగా బియ్యానికి బదులు వారి ఖాతాకు నగదు బదిలీ చేస్తోందన్నారు. ఇది పేదలపట్ల మాకున్న నిబద్ధత అన్నారు. శాసనసభ ఎన్నికల వేళ ఇచ్చిన గ్యారెంటీ హామీలను అమలు చేస్తున్నామన్నారు. ప్రస్తుతం లోకసభ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థికి మద్దతు ఇవ్వాలన్నారు. సమావేశంలో ఏఐసీసీ కార్యదర్శి, రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జ్ రణదీప్‌సింగ్ సుర్జేవాలా, నాసీర్ హుసేన్, మంత్రి ప్రియాంక ఖర్గే, ఎమ్మెల్యే యాబీ వెంకటేశ్, కేకేఆర్‌డీబీ అధ్యక్షుడు అజయ్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.


కంకర తేలిన శీర్పి- విరుపాపల్లి రోడ్డు

# పాలకులారా.. పరిశ్రమలు ఏవీ..?


- సెజ్‌ల పేరిట వేల ఎకరాల సేకరణ
- ఏళ్లు గడిచినా ప్రారంభం కాని పరిశ్రమలు
- ఇప్పటికే మూతపడిన స్థానిక ఫ్యాక్టరీలు
- ఉపాధి కోసం వలస వెళ్తున్న ప్రజలు
- అభివృద్ధికి దూరంగా మడకశిర ప్రాంతం

మడకశిర

వెనుకబడిన మడకశిర ప్రాంతంలో పరిశ్రమలు నెలకొల్పి, ఉపాధి కల్పించాలని ప్రభుత్వం భూములు సేకరించి ఏళ్లు గడుస్తున్నా ఒక్క ఫ్యాక్టరీ కూడా ఇక్కడ ప్రారంభం కాలేదు. దీంతో ఈ ప్రాంత ప్రజలు ఉపాధి కోసం కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాలకు వలస వెళ్తున్నారు. స్థానికంగా నీటి వసతి లేకపోవడంతో వ్యవసాయం కూడా అంతంత మాత్రంగానే సాగుతోంది. పరిశ్రమలు ఏర్పాటు చేస్తామని సెజ్‌ల పేరుతో ప్రభుత్వం పదేళ్ల కిందట రైతుల నుంచి భూమి సేకరించింది. దీంతో సాగు చేస్తున్న భూమి పోవడం, పరిశ్రమలు నెలకొల్పకపోవడంతో రైతులు, కూలీలు ఉపాధి కోసం బెంగళూరు, మైసూరు, తెలంగాణ ప్రాంతాలకు వలస వెళ్తున్నారు. ఈ వలసలు నివారించడానికి రాష్ట్ర ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోలేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రధాన పార్టీలు మడకశిర అభివృద్ధిని తమ మేనిఫెస్టోలో చేర్చి, ఆమేరకు అమలు చేయాలని కోరుతున్నారు.

**మంత్రిమండలి ఆమోదం తెలిపినా ముందుకు పడని అడుగు**

ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో ఏడాది కిందట జరిగిన మంత్రిమండలి సమావేశంలో మడకశిర మండలంలో పారిశ్రామిక వాడ ఏర్పాటు చేయాలనే ప్రతిపాదనను ఆమోదించారు. కాని నేటికి ఎలాంటి ప్రక్రియ ప్రారంభం కాలేదు. మడకశిర మండలంలో పరిశ్రమల ఏర్పాటుకు గతంలోనే వేల ఎకరాల భూములను సేకరించారు. అందుకు సంబంధించి పరిహారం చెల్లించారు. 2012లో ప్రత్యేక ఆర్థిక మండలి (సెజ్) ఏర్పాటు ద్వారా పరిశ్రమలు నెలకొల్పడానికి భూములు సేకరించారు. మడకశిర మండలం గౌడనహళ్లి, ఆర్. అనంతపురం, చత్రం గ్రామాల పరిధిలో 1600 ఎకరాలు సేకరించారు. మడకశిర మండలం సి.కొడిగేపల్లి, కేతేపల్లి వద్ద 2006లో 1230 ఎకరాల భూమిని సేకరించారు. అయితే పరిశ్రమలు మాత్రం నెలకొల్పలేదు.


పదేళ్ల కిందట మూతపడిన ట్విస్టింగ్ యూనిట్

**ఇంటికో ఉద్యోగం ఏదీ?**

భూములు సేకరించేటప్పుడు పరిశ్రమలు నెలకొల్పి ఇంటికో ఉద్యోగం ఇప్పిస్తామన్నారు. కానీ నేటి వరకూ ఒక్క పరిశ్రమా రాలేదు. ఒక్కరికీ ఉపాధి దొరకలేదని స్థానికులు ఆగ్ర హం వ్యక్తం చేస్తున్నారు. వ్యవసాయం చేస్తున్న భూములు కూడా పోవడంతో స్థానికంగా ఉపాధిలేక వలస వెళ్తున్నామని వా రు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప రిశ్రమలు నెలకొల్పక పోతే తమ భూములు వెనక్కు ఇవ్వాలని రైతులు డిమాండు చేస్తున్నారు.



పరిశ్రమల కోసం కేటాయించిన భూములు

**ఉన్న పరిశ్రమలు మూత**

మడకశిర ప్రాంతంలో ఉన్న అరకొర పరిశ్రమలు కూడా మూతపడటంతో చాలామంది ఉపాధి కరువై కర్ణాటక ప్రాంతానికి వలస వెళ్తున్నారు. మడకశిరలో ట్విస్టింగ్ యూనిట్, రీలింగ్ యూనిట్ ద్వారా ఉపాధి పొందేవారు. దాన్ని పదిహేనేళ్ల కిందట మూసి వేయడంతో చాలమందికి ఉపాధి కరువైంది. ట్విస్టింగ్ యునిట్‌లో పనిచేసినవారు ఆందోళన చేసినా ఫలితం లేకుండా పోయింది. మడకశిర మండలం నీలకంఠాపురంలో కన్వ పరిశ్రమ ద్వారా 200నుంచి 300 దాకా ఉపాధి పొందేవారు. దాన్ని కూడా రెండేళ్ల కిందట మూసి వేశారు. హిందూపురం వద్ద ఏర్పాటు చేసిన గార్మెంట్స్ పరిశ్రమ రెండేళ్లయినా ప్రారంభానికి నోచుకోలేదు. ఈ పరిశ్రమ ప్రారంభం అయితే వెయ్యి మందికి పైగా ఉపాధి లభిస్తుంది.

**స్థానికంగా పనులు లేవు**

మాకు స్థానికంగా ఎలాంటి పనులూ లేవు. దీంతో మాకు దగ్గరగా ఉన్న కర్ణాటక ప్రాంతానికి ఉపాధి కోసం వలస వెళ్లాల్సి వస్తోంది. వర్షాలు కురవకపోవడం, స్థానికంగా పనులు లేకపోవడంతో చాలా మంది బెంగళూరుకు పనులు నిమిత్తం వలస వెళ్తున్నారు. అక్కడ కూడా వెంటనే పనులు దొరకవు. పండుగలకు, ఇతర అత్యవసర పనులు పడినప్పుడు మాత్రమే సొంతూళ్లకు వస్తాం. స్థానికంగానే పరిశ్రమలు ఏర్పాటు చేసి ఉపాధి కల్పిస్తే మాకు ఈ బాధతలు తప్పుతాయి.

**మారన్న , కొత్తపాళ్యం, రొళ్ల మండలం**


నిర్మాణం పూర్తయినా ప్రారంభానికి నోచుకోని గార్మెంట్ పరిశ్రమ

## అధ్వానంగా గ్రామీణ రహదారులు

**బెళుగుప్ప, ఏప్రిల్ 29:** వైసీపీ పాలనలో గ్రామీణ రోడ్లు అధ్వానంగా మారాయి. ఈ రోడ్లపై ప్రయాణం చేయడానికి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మండలంలోని శీర్పి నుంచి విరపాపల్లికి వెళ్లే రోడ్డు ఐదు కిలోమీటర్లు కంకర తేలి అధ్వానంగా ఉంది. కాలినడకన వెళ్లడానికి కూడా వీలు కాక ప్రయాణికులు నానా అవస్థలు పడుతున్నారు. వెంకటాద్రిపల్లి, శీర్పి గ్రామాల ప్రజలు వ్యవసాయ తోటల్లోకి ద్విచక్ర వాహనాలలో వెళ్లాలంటే ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని ప్రయాణించాల్సి వస్తోందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్షాకాలంలో మరింత దారుణంగా ఉంటుందని వారు పేర్కొంటున్నారు. ప్రయాణానికి ఇన్ని ఇబ్బందులు పడుతున్నా రోడ్ల బాగుకోసం గత ఐదేళ్లుగా ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోలేదు. శ్రీరంగాపురం నుంచి బూదివర్తికి వెళ్ల రోడ్డుకూడా గుంతలమయమై అధ్వానస్థితిలో ఉంది. ప్రభుత్వ నిర్లక్ష్యంతోనే తమకు కష్టాలు తప్పడం లేదని ప్రయాణికులు వాపోతున్నారు. ఈ ఐదేళ్లలో రోడ్ల మరమ్మతులకు ప్రభుత్వం ఒక్క రూపాయి కూడా మంజూరు చేయకపోవడం గమనార్హం.


పాడైపోయిన బూదివర్తి రోడ్డు

# ఎన్నికల వేళ పోలీసులు అప్రమత్తం

- శింగనమల నియోజకవర్గంలో ఫ్యాక్షన్, సమస్యాత్మక గ్రామాలపై నిఘా
- రౌడీషీటర్ల బైండోవర్
- పుట్లూరు, యల్లనూరు మండలాలపై ప్రత్యేక దృష్టి



బుక్కరాయసముద్రం


ఎన్నికల నేపథ్యంలో సమస్యాత్మక గ్రామాలపై పోలీసులు ప్రత్యేక నిఘా పెట్టారు. శింగనమల నియోజకవర్గంలో ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించడమంటే అధికారులకు కత్తిమీద సామే. ఫ్యాక్షనిజం, అధిపత్య పోరు కల్గి ఉన్న గ్రామాలు అధికంగా ఉన్నాయి. ఈ నియోజకవర్గంలో ఎన్నికలు పోలీసులకు సవాలుగానే చెప్పాలి. రెండు పార్టీలకు గెలుపే ధ్యేయంగా భావిస్తుండటంతో వాతావరణం వేడిక్కింది. దీంతో పోలీసులు, ఎన్నికల విభాగం అధికారులు అప్రమత్తమయ్యారు. పోలీసు అధికారులు సమస్యాత్మక గ్రామాలపై డేగకన్ను పెట్టారు. 1994, 1999, 2004, 2009లో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో రీపోలింగ్, రిగ్గింగ్, రీ సైక్లింగ్, ఇరువర్గాలు ఘర్షణలు చోటుచేసుకున్నాయి. ఎన్నికల సమయంలో గొడవలు, ఇతర సంఘటనల ఆధారంగా సమస్యాత్మక గ్రామాలను గుర్తించారు.

**సమస్యాత్మక గ్రామాల్లో జల్లెడ**



ప్రశాంతంగా ఎన్నికలు నిర్వహించేందుకు సమస్యాత్మక గ్రామాలను పోలీసులు జల్లెడ పడుతున్నారు. ఎన్నికల సందర్భంగా తొలుత ఆరు మండలాల్లోని రౌడీషీటర్లను బైండోవర్ చేసి కౌన్సిలింగ్ నిర్వహిస్తున్నారు. సమస్యాత్మక గ్రామాల్లో రాజకీయ నేతలపై నేర చరిత్ర కల్గిన కేసులు ఉంటే బైండోవర్ చేయాలని జిల్లా పోలీసు ఉన్నతాధికారుల నుంచి మౌఖిక ఆదేశాలు వచ్చినట్లు తెలిసింది. ఎలాంటి కేసులు లేని నేతలపై బైండోవర్ చేసేందుకు ఇప్పటి వరకు ఎలాంటి ఆదేశాలు లేవని పోలీసులు చెబుతున్నారు. ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు ఫ్లాగ్ మార్చ్, నాకాబందీ నిర్వహిస్తున్నారు. అనుమానపు వ్యక్తులు, ఫ్యాక్షన్ నేతల ఇళ్లలో ముమ్మరంగా తనిఖీలు చేపడుతున్నారు.

**పుట్లూరు, యల్లనూరు మండలాలపై ప్రత్యేక నిఘా**



శింగనమల నియోజకవర్గంలోనే ప్రత్యేకమైన పుట్లూరు, శింగనమల మండలాలపై ప్రత్యేక నిఘా పెట్టారు. సమస్యాత్మక కేంద్రాల్లో ఎన్నికలు సవ్యంగా సాగాలంటే అన్ని విభాగాల అధికారులు సమగ్ర అధ్యయనం చేసి సమన్వయంతో చర్యలు తీసుకోవాల్సి ఉంటుంది. పలుచోట్ల వెబ్‌కాస్టింగ్ ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది. గతంలో పలు గ్రామాల్లో రీసైక్లింగ్, రిగ్గింగ్ జరిగిన ఘటనలు అనేకంగా ఉన్నాయి. ఈ నేపథ్యంలో ప్రజలు ప్రశాంతంగా ఓటు హక్కును వినియోగించుకునేలా అధికారులు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

**బైండోవర్, సమస్యాత్మక గ్రామాలు ఇవే..**

నియోజకవర్గంలో అత్యంత సమస్యాత్మక మండలంగా యల్లనూరును గుర్తించారు. ఈ మండలంలో 15 గ్రామాలను గుర్తించి ఇరు పార్టీలకు చెందిన 469 నేతలు, కార్యకర్తలు ముందుస్తుగా బైండోవర్ చేశారు. కల్లూరు, వెన్నపూసపల్లి, తిమ్మంపల్లి, యల్లనూరు, మేడకుర్తి, అచ్యుతాపురం, దంతాలపల్లి, నిడిజంపల్లి, కూచివారిపల్లి, చింతకాయమందా, సింగవరం, వేములపల్లి, గడ్డంవారి వెంకటంపల్లిని సమస్యాత్మక గ్రామాలుగా గుర్తించారు బుక్కరాయసముద్రం మండలంలో 9 సమస్యాత్మక గ్రామాలను గుర్తించి 410 మందిని బైండోవర్ చేశారు. చెన్నంపల్లి, వడియంపేట, కేకే ఆగ్రహారం, నీలంపల్లి, రేగడికొత్తూరు, బి. కొత్తపల్లి, జంతులూరు, వెంకటాపురం, బొమ్మలాటపల్లి గ్రామాలను పోలీసులు సమస్యాత్మకమైనవిగా గుర్తించారు. మండల వ్యాప్తంగా పలువురు వైసీపీ, టీడీపీ, సీపీఐకి చెందిన మద్దతుదారులు, రౌడీషీటర్లను బైండోవర్ చేశారు. గార్లదిన్నె మండలంలో ఆరు సమస్యాత్మక గ్రామాలను గుర్తించి 600 మందిని బైండోవర్ చేశారు. ఈ మండలంలో గార్లదిన్నె, మర్తాడు, పెనకచెర్ల, కేశవాపురం, ఇల్లూరు, కల్లూరు గ్రామాలను అత్యంత సమస్యాత్మకంగా తేల్చారు. శింగనమల మండలంలో ఏడు సమస్యాత్మక గ్రామాలను గుర్తించి 306 మందిని బైండోవర్ చేశారు. నిదనవాడ, సి.బండమీదపల్లి, ఉలికల్లు, సలకంచెరువు, కల్లుమడి తరిమెలను అత్యంత సమస్యాత్మక గ్రామాలుగా గుర్తించారు. ఇప్పటి వరకు మండలంలో టీడీపీ, వైసీపీ, సీపీఐకి చెందిన 306 మందిని బైండోవర్ చేపట్టారు. పుట్లూరు మండలంలో ఏడు సమస్యాత్మక గ్రామాలను గుర్తించి 470 మందిని బైండోవర్ చేయించారు. ఈ మండలంలో ఏడు గ్రామాలను అత్యంత సమస్యాత్మకమైనవిగా గుర్తించారు. వీటిలో మడుగుపల్లి, చాలవేముల, మడ్డిపల్లి, కోమటికుంట్ల, కుమ్మనమల, అరకటవేముల, గరుగుచింతలపల్లి ఉన్నాయి. ఇప్పటి వరకు 470 మందిని బైండోవర్ చేపట్టారు. నార్పల మండలంలో ఏడు గ్రామాలు అత్యంత సమస్యాత్మకమైనవి ఉండగా 507 మందిని బైండోవర్ చేయించారు. ఈ మండలంలో నార్పల, బండ్లపల్లి, కర్ణపుడికి, గడ్డంనాగేపల్లి, వెంకటంపల్లి, నడిమిదొడ్డి, పులుసులనూతల గ్రామాలను అత్యంత సమస్యాత్మకమైనవిగా గుర్తించి ఇప్పటి వరకు 507 మంది బైండోవర్ చేశారు.

**ప్రశాంత ఎన్నికలే లక్ష్యం**



శింగనమల నియోజకవర్గంలో ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించడమే లక్ష్యంగా పనిచేస్తున్నాం. ఎన్నికల్లో ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా ముందుస్తు చర్యలు చేపడుతున్నాం. ఎన్నికలకు విఘాతం కల్గించే వారిపై నిఘా పెంచాం. గ్రామాల్లో పర్యటించి ఇరువర్గాలకు కౌన్సిలింగ్ ఇచ్చి, ఘర్షణలుకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరిస్తున్నాం. సమస్యాత్మక గ్రామాలపై ప్రత్యేక నిఘా విధించాం.

**- బి.వీరశివారెడ్డి, డీఎస్పీ, అనంతపురం రూరల్**


చెన్నంపల్లిలో పోలీసుల కౌన్సెలింగ్ (ఫైల్)

# ఏర్పాట్లకు నిధులేవీ..?

- పోలింగ్ స్టేషన్లపై చేతులెత్తేశారు
- ఒక్క రూపాయీ ఇవ్వని అధికారులు
- జిల్లా వ్యాప్తంగా 2,236 పోలింగ్ స్టేషన్లు
- ఏర్పాట్లు చేయాలంటూ సెక్టార్ ఆఫీసర్లపై ఒత్తిడి
- నాడు-నేడు, ఎస్ఎంఎఫ్ నిధులు వాడుకోవాలని సలహా
- ఓటర్లకు తిప్పలు తప్పవా..?



**అనంతపురం విద్య, ఏప్రిల్ 29 :** ఎన్నికల సమయం సమీపిస్తోంది. పోలింగ్ తేదీ రాగానే అందరికీ గుర్తొచ్చేవి పోలింగ్ స్టేషన్లు. పోలింగ్ స్టేషన్లలో కనీస సదుపాయాలు కల్పించాలి. గతంలో పోలింగ్ కేంద్రాల్లో తాత్కాలిక మరమ్మతులకు నిధులు మంజూరు చేసేవారు. దీంతో సంబంధిత అధికారులు మరమ్మతులు చేయించి పోలింగ్ నాటికి అన్నీ సిద్ధం చేసేవారు. ఇప్పుడు కూడా పనులు చేయండి అంటూ ఆదేశిస్తున్నారు కానీ.. ఒక్క రూపాయి కూడా నిధులు ఇవ్వడం లేదు. జిల్లాలోని సెక్టార్ ఆఫీసర్లకు వారి పరిధిలోని పోలింగ్ కేంద్రాల్లో సదుపాయాల కల్పన బాధ్యతలు అప్పగించారు. చిల్లిగవ్వ ఇవ్వకుండా ఏర్పాట్లు ఎలా అంటూ వారు మింగలేక, కక్కలేక, ఎవరికి చెప్పకోవాలో తెలియక నలిగిపోతున్నారు. పాఠశాలలకు నాడు-నేడు మిగిలిన డబ్బులు, స్కూల్ మెయింటెనెన్స్ ఫండ్స్(ఎస్ఎంఎఫ్)తో మరమ్మతులు, ఇతర సదుపాయాల కల్పించాలంటూ ఉన్నతాధికారులు ఆదేశాలిస్తున్నారు.

**కేంద్రాల్లో ఏర్పాట్లు ఎలా...?**

జిల్లా వ్యాప్తంగా 2,236 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. ఈ ఏడాది మార్చిలో విడుదల చేసిన గెజిట్‌లో అనంతపురం జిల్లాలోని ఏడు నియోజకవర్గాలు, రాప్తాడు నియోజకవర్గంలోని మూడు మండలాలు కలిపి 8 అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో 2,236 కేంద్రాలు ఉన్నాయి. చాలా పోలింగ్ కేంద్రాలు పాఠశాలలు, ప్రభుత్వ కార్యాలయాల్లో ఉన్నాయి.



కేంద్రాల్లో విద్యుత్ సదుపాయం, ఫ్యాన్లు, లైటింగ్‌తో పాటు, మరుగుదొడ్లు, తాగు నీరు, దివ్యాంగులు, అనారోగ్యంతో ఉన్న ఓటర్ల సౌకర్యార్థం ర్యాంపులు ఏర్పాటు చేయాలి. గత ఎన్నికల్లో గొడవలు, అల్లర్ల వల్ల సమస్యాత్మకంగా ఉంటే...ఆ పోలింగ్ కేంద్రాల వద్ద బారికేడ్లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఈ బాధ్యతలను సెక్టార్ అధికారులకు అప్పగించారు. ఈ ఏర్పాట్లకు డబ్బులెలా అని సెక్టార్ ఆఫీసర్లు సతమతమవుతున్నారు.

**డబ్బుల్లేక అధికారుల గగ్గోలు**

జిల్లాలో 2,236 పోలింగ్ కేంద్రాలుంటే....241 సెక్టార్లుగా విభజించారు. ఒక్కో సెక్టార్‌కు ఒక్కో అధికారి చొప్పున 241 మందితోపాటు అదనంగా 22 మంది (రిజర్వు)ని నియమించారు. వందలాది కేంద్రాల్లో సమస్యలు ఉన్నాయి. ర్యాంపులు, మరుగుదొడ్లు , ఫ్యాన్లు, బారికేడ్లు వంటివి ఏర్పాటు చేయాలంటే..వేలాది రూపాయలు ఖర్చవుతుంది. అప్పటికే ఉన్న మెట్లపై ర్యాంపు ఏర్పాటు చేయాలన్నా... కొత్తగా మెట్లు పెట్టించి ర్యాంపు ఏర్పాటు చేయించాలన్నా...రమారమి రూ. 4 వేల నుంచి రూ. 6 వేల వరకూ వ్యయమవుతుందని సెక్టార్ ఆఫీసర్లు వాపోతున్నారు. మరుగుదొడ్లు, ఫ్యాన్లు, బారికేడ్ల ఏర్పాటుకు సైతం వేలాది రూపాయలు ఖర్చు చేయాల్సిందే. ఇప్పటి వరకూ సెక్టార్ అధికారులకు ఉన్నతాధికారులు డబ్బులు ఇవ్వలేదు. స్కూళ్ల ఆవరణలో ఉన్న పోలింగ్ స్టేషన్లలో ఏవైనా సదుపాయాలు చేయాలంటే.... నాడు-నేడు పనులు జరుగుతున్న స్కూళ్లలో నిధులు మిగిలి ఉంటే..వాటిని సర్దుబాటు చేసుకోవాలని ఉన్నతాధికారులు చెబుతున్నారని తెలిసింది. నాడు-నేడు పనులు జరగని పాఠశాలలు ఉన్న పోలింగ్ కేంద్రాలు, ప్రభుత్వ కార్యాలయాలు, ఇతర ప్రాంతాల్లో ఉన్న పోలింగ్ కేంద్రాల్లో ఈ సదుపాయాలు చేయాలంటే ఎలాగని తలలు పట్టుకుంటున్నారు. వివిధ శాఖ అధికారులను సెక్టార్ ఆఫీసర్లుగా వేశారు. వాళ్లకు కేటాయించిన పోలింగ్ బూత్‌ల వద్దకు వెళ్లి అవి ఏ శాఖ పరిధిలోకి వస్తున్నాయో కనుక్కుని, ఆ శాఖల అధికారుల వద్దకు వెళ్లి ఈ ఏర్పాట్లు చేయాలంటే ఎలా అంటూ గగ్గోలు పెడుతున్నారు. దీంతో అటు సెక్టార్ ఆఫీసర్లు, ఇటు సంబంధిత అధికారులు డబ్బుల్లేక బిక్కమొహాలేసి చూసుకునే దుస్థితి నెలకొంది.

| నియోజకవర్గం | పోలింగ్ కేంద్రాలు | రూట్లు | సెక్టార్లు | సెక్టార్ ఆఫీసర్లు |
| --- | --- | --- | --- | --- |
| రాయదుర్గం | 296 | 32 | 32 | 34 |
| ఉరవకొండ | 263 | 32 | 32 | 37 |
| గుంతకల్లు | 276 | 29 | 29 | 31 |
| తాడిపత్రి | 274 | 29 | 29 | 32 |
| శింగనమల | 293 | 30 | 30 | 32 |
| అనంతపురం అర్బన్ | 292 | 30 | 30 | 34 |
| కళ్యాణదుర్గం | 261 | 25 | 25 | 27 |
| రాప్తాడు | 281 | 34 | 34 | 36 |
| మొత్తం | 2,236 | 241 | 241 | 263 |

**తక్కువ సమయంలో పనులు సాధ్యమేనా..?**

నామినేషన్ల ప్రక్రియ ముగిసింది. వచ్చే నెల 13వ తేదీనే పోలింగ్. 12వ తేదీ నుంచే ఆ కేంద్రాలు అధికారుల చేతుల్లోకి వెళ్లిపోతాయి. అంటే 11వ తేదీ నాటికి అక్కడ ఏర్పాట్లు పూర్తి చేయాల్సి ఉంటుంది. ఇప్పుడు కావాల్సిందల్లా డబ్బు. గతంలో నిధులు కేటాయించి పనులు చేయమని చెప్పేవారు. ఈ దఫా మాత్రం చిల్లి గవ్వ ఇవ్వకుండా పనులు చేయాలని ఆదేశాలిస్తే తాము ఏమి చేయాలని సెక్టార్ ఆఫీసర్లు వాపోతున్నారు.


అనంతపురం రూరల్‌లోని పాఠశాలలో పోలింగ్ బూత్‌లు

**ఓటేసేకి ఊరికి రాండన్నో..**



**హలో..** నమస్తే అన్నా, నమస్తే అక్క బాగున్నారా? యా ఊర్లో ఉండారు? ఎలచ్చన్లు వచ్చే నెల 13న ఉండాయి. మీ అందరూ తప్పకుండా ఊరికి రావల్ల. ఇండి ఆడ మనూరోళ్లు ఎంతమంది ఉండారు. వాళ్ల ఫోన్ నంబర్లు కూడా ఇయ్యండి. వాళ్లని రమ్మని సెబుతాం. మీరు రొండు దినాలు ముందే రాండన్నా. ఆడ మనోళ్లు ఎంతమంది ఉండారో కచ్చితంగా సెబితే వచ్చి పొయ్యేదానికి శార్జీలకు దుడ్ల ఫోన్‌పేలో చేస్తాం. ఇలా గ్రామాల నుంచి ఇతర ప్రాంతాలకు వలస వెళ్లిన ప్రజలను స్థానిక నాయకులు ఫోన్ చేసి అడుగుతున్నారు. మండలం నుంచి బెంగళూరు, విజయవాడ, హైదరాబాద్, తిరుపతి వంటి ప్రాంతాలకు అనేకమంది వలస వెళ్లారు. ఎన్నికల్లో ప్రతి ఓటు కీలకం కావడంతో వారిని ఓటింగ్‌కు రప్పించేందుకు ఆయా గ్రామాల నాయకులు ప్రయత్నిస్తున్నారు. ఈక్రమంలో రానుపోను చార్జీలు భరించడంతో పాటు ఓటుకు ఇంత అని ముట్టచెప్పడానికి సైతం అభ్యర్థుల అనుచరులు వెనుకాడటం లేదు. ఓటరు జాబితా తీసుకుని వలస ఓటర్ల పేర్లు, సీరియల్ నెంబర్, బూత్ నెంబర్ వారిగా మరో జాబితాలు తయారు చేసే పనిలో నిమగ్నమయ్యారు.

- ముదిగుబ్బ

**సమస్యలు ఇస్త్రీ చేసేస్తా**


రాయదుర్గం 24వ వార్డులో ఎన్నికల ప్రచారంలో భాగంగా సోమవారం ఓ రజకుడిని ఓటు అభ్యర్థిస్తూ దుస్తులు ఇస్త్రీ చేస్తున్న టీడీపీ అభ్యర్థి కాలవ శ్రీనివాసులు

- రాయదుర్గం



**బిడ్డా.. మా ఓట్లన్నీ నీకే..!**

**ఎండనపడి** తిరుగుతూ ఎంత కష్టపడుతున్నావు తల్లీ.! మా ఓట్లన్నీ తప్పకుండా నీకే వేస్తాం. బిడ్డా..! నువ్వు సల్లగుండాలి అంటూ ఎన్నికల ప్రచారంలో ఉన్న పల్లె సింధూరారెడ్డిని ఓ వృద్ధురాలు ఆశీర్వదించారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా సింధూరారెడ్డి అమడగూరులో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా అక్కడ ఉన్న ఓవృద్ధురాలు పల్లె సింధూరను దగ్గరకు పిలిచి తలపై పూలు వేసి నీవు చల్లగా ఉండాలంటూ ఆశీర్వదించారు.


- పుట్టపర్తి

పల్లె సింధూరరెడ్డిని దీవిస్తున్న వృద్ధురాలు

## నేటి ప్రముఖులు

పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కాంప్...

### దాదాసాహెబ్ ఫాల్కే (జయంతి)



దేశంలో పేరొందిన సినీ దర్శక, నిర్మాత ధుండిరాజ్ గోవింద్ ఫాల్కే. 1870 ఏప్రిల్ 30న బాంబే ప్రాంతంలో జన్మించారు. తొలి సినిమా 1913లో 'రాజా హరిశ్చంద్ర'తోనే గుర్తింపు సాధించారు. 19ఏళ్ల కెరీర్‌లో 95 ఫీచర్ లెంగ్త్ సినిమాలు, 27 షార్ట్ ఫిల్మ్ తీశారు. మోహిని భస్మాసుర (1913), సత్యవన్ సావిత్రి (1914), లంకా దహన్ (1917), శ్రీకృష్ణ జన్మ (1918), కాళీయమర్ధన్ (1919) వంటి సినిమాలు ఎంతో పేరొందాయి. చిత్రకారుడిగా కూడా ప్రతిభ చాటుకున్నారు. ది ఫాదర్ ఆఫ్ ఇండియన్ సినిమాగా పేరొందారు. సినిమా రంగంలో ఆయన అందించిన సేవలకు గాను 'దాదా సాహెబ్ ఫాల్కే అవార్డు'ను కేంద్రప్రభుత్వం ఇస్తోంది. 1944 ఫిబ్రవరి 16న కన్నుమూశారు.

### శ్రీశ్రీ (జయంతి)



శ్రీశ్రీగా పేరొందిన శ్రీరంగం శ్రీనివాసరావు 1910 ఏప్రిల్ 30న జన్మించారు. 20వ శతాబ్దపు తెలుగు సాహిత్యాన్ని శాసించిన మహాకవిగా పేరొందారు. సాంప్రదాయ, ఛందోబద్ధ కవిత్వాన్ని ధిక్కరించినవాడిగా, విప్లవకవిగా, అభ్యుదయ రచయితల సంఘం అధ్యక్షుడిగా, విప్లవ రచయితల సంఘం స్థాపక అధ్యక్షుడిగా, సినిమా పాటల రచయితగా రాణించారు. హేతువాది, నాస్తికుడు. ఏడో యేటనే రచనా వ్యాసంగాన్ని ప్రారంభించిన ఘనత ఆయనది. తన మొదటి గేయాల పుస్తకం ఎనిమిదో యేట ప్రచురింపబడింది. 'మహాప్రస్థానం' ఆయన రచనల్లో ప్రసిద్ధమైనది. అల్లూరి సీతారామరాజు సినిమాకు ఆయన రాసిన తెలుగువీర లేవరా... అనేది శ్రీశ్రీ రాసిన ఆణిముత్యాల్లో ఒకటి. ఎన్నో పురస్కారాలు అందుకున్నారు. 1983 జూన్ 15న కన్నుమూశారు.

### సోనాల్ మాన్‌సింగ్ (పుట్టినరోజు)



పద్మవిభూషణ్ గ్రహీత సోనాల్ మాన్‌సింగ్ 1944 ఏప్రిల్ 30న ముంబైలో జన్మించారు. క్లాజికల్ డ్యాన్సర్, భరతనాట్యం, ఒడిస్సీ నృత్యాలలో గురువుగా పేరొందారు. కేళుచరన్ మోహపాత్ర వద్ద ఒడిస్సీలో ఆమె తర్ఫీదు పొందారు. న్యూ ఢిల్లీలో సెంటర్ ఫర్ ఇండియన్ క్లాజికల్ డ్యాన్సెస్ కేంద్రాన్ని స్థాపించారు. పద్మభూషణ్, పద్మ విభూషణ్, సంగీత నాటక అకాడమీ అవార్డు, కాళిదాస్ సమ్మాన్ తదితర గౌరవాలు అందుకున్నారు.

### సుధా రఘునాథన్ (పుట్టినరోజు)



ప్రముఖ కర్ణాటక సంగీత గాయని 1956 ఏప్రిల్ 30న జన్మించారు. ఆర్థికశాస్త్రంలో పీజీ పట్టా పొందారు. తల్లి స్ఫూర్తితో సంగీతంపై అభిరుచితో ప్లే బ్యాక్ సింగర్‌గా రాణించడమే కర్ణాటక సంగీతంలో కాక దేశ విదేశాల్లో కచేరీలు ప్రదర్శించారు. పద్మశ్రీ, సంగీత కళానిధి, కళామణి, పద్మవిభూషణ్, సంగీత చూడామణి తదితర పురస్కారాలు అందుకున్నారు.

### రోహిత్ శర్మ (పుట్టినరోజు)



రోహిత్ గురునాథ్ శర్మ 1987 ఏప్రిల్ 30న నాగ్‌పూర్‌లో జన్మించారు. ఇంటర్నేషనల్ క్రికెటర్‌గా రాణించి ప్రస్తుతం దేశ జాతీయ జట్టుకు కేప్టెన్‌గా ఉన్నారు. ఐపీఎల్‌లో ముంబై ఇండియన్స్ తరఫున ఆడారు. వన్డేలలో అత్యధికంగా 264 పరుగులు చేశారు. కాగా వన్డే ఇంటర్నేషనల్స్‌లో మూడు డబుల్‌సెంచరీలు చేసిన ఘనత ఉంది. 2023 క్రికెట్ వరల్డ్‌కప్ వేళకు 556 సిక్స్‌లు, 50ఓవర్ల ఫార్మాట్‌లో 300 సిక్స్‌లు పూర్తి చేసిన తొలి ఇండియన్‌గా గుర్తింపు పొందారు. అర్జున అవార్డు, మేజర్ ధ్యాన్‌చంద్ ఖేల్‌రత్న తదితర అవార్డులు పొందారు. క్రికెటర్‌గానే కాక వన్యప్రాణుల సంరక్షణ విషయంలో పలు జాగృతి కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు.

# వైభవంగా లక్ష్మీవెంకటరమణస్వామి రథోత్సవం

**చింతామణి, ఏప్రిల్ 29:** తాలూకాలోని అనూరు గ్రామంలో పురాతనమైన లక్ష్మీ వెంకటరమణస్వామి ఆలయ ఉత్సవాల్లో భాగంగా సోమవారం స్వామివారి రథోత్సవం వైభవంగా జరిగింది. ఉదయం విశేషపూజల అనంతరం రథానికి కళశస్థాపన, రథాంగ హోమం, అలంకార ఉత్సవం, పుష్పాలంకరణ నిర్వహించారు. మధ్యాహ్నం గ్రామస్థులచే బ్రహ్మరథోత్సవం సాగింది. భక్తుల గోవిందనామస్మరణ నడుమ రథం కదిలింది. పానకం, మజ్జిగ పంపిణీ సహా అన్నదానం నిర్వహించారు. గరుడోత్సవం, పుష్పాలంకరణ ఏర్పాటు చేశారు. చుట్టుపక్కల గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.



కరగధారి నృత్యం



అనూరులో రథోత్సవం ఇన్‌సెట్‌లో విశేష అలంకరణలో స్వామివారు

### ఘనంగా కరగ మహోత్సవం

**శిడ్లఘట్ట, ఏప్రిల్ 29:** తాలూకాలోని మేలూరు గ్రామ పంచాయతీ పరిధిలో కరగ మహోత్సవం ఘనంగా ఊరేగింది. 11రోజులపాటు రేణుకా ద్రౌపతమ్మ అమ్మవారికి విశేషపూజలు నిర్వహించారు. ఆదివారం రాత్రి హసికరగ మహోత్సవం సాగింది. మేళూరు, మలూరు పంచాయతీ తదితర చుట్టుపక్కల గ్రామాల ప్రజలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. కరగ ఊరేగింపుసాగే ప్రతి ఇంటి వద్ద రంగవల్లులు వేసి ముస్తాబు చేశారు. పలు కూడళ్లలో కరగధారి నృత్యం చేశారు.

## వినూత్నంగా మహిళా దినోత్సవం



గోపూజ నిర్వహిస్తున్న మహిళలు

**విజయపుర, ఏప్రిల్ 29:** పట్టణంలోని నగరేశ్వరస్వామి ప్రార్థనామందిరంలో అయోధ్య నగర శివాచార్య వైశ్యనగర్త మహిళా సంఘం ఆధ్వర్యంలో అక్క మహాదేవి జయంతి, అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని సోమవారం వినూత్నంగా నిర్వహించారు. తొలుత గోపూజ నిర్వహించారు. అనంతరం ప్రతిభావంత విద్యార్థులకు ప్రోత్సాహకాలు అందజేశారు. వివిధ రంగాల సాధకులను సత్కరించారు. హొసకోటె మిలీనియం స్కూల్ సంస్థాపక సభ్యురాలు రూప శ్రీధర్ మాట్లాడుతూ మారుతున్న కాలానికి అనుగుణంగా కుటుంబ నిర్వహణభారం పెరిగిందని ఇందుకు తగినట్టుగా మహిళలు సైతం కష్టించాల్సిన అవసరం ఉందన్నారు. రానున్న రోజుల్లో పురుషులకు ధీటుగా అన్ని రంగాల్లో మహిళలు పోటీ పడాల్సి ఉంటుందన్నారు. ఉత్తమ, ఉన్నత విద్యతోనే ఇది సాధ్యమన్నారు. నగర్త మహిళా సంఘం అధ్యక్షురాలు లీలావతి రుద్రమూర్తి అధ్యక్షత వహించి మాట్లాడుతూ అక్క మహాదేవి వచనాలను రచించడం ద్వారా కన్నడ తొలి కవయిత్రిగా గుర్తింపు పొందారన్నారు. ఈ సందర్భంగా మహిళలకు పలు పోటీలు నిర్వహించి బహుమతులను ప్రదానం చేశారు. 2022-23లో ద్వితీయ పీయూ ఫలితాల్లో రాష్ట్రానికి నాల్గో ర్యాంకు సాధించిన పట్టణానికి చెందిన ప్రేరణ నాగరాజ్‌ను సత్కరించారు. బెంగళూరు మాతృ సంస్థ డైరెక్టర్ సువర్ణ శివకుమార్, మహిళా సంఘం కార్యదర్శి భారతి ప్రభుదేవ్, భారతి విశ్వనాథ్, మాణిక్య నంజణ్ణ తదితరులు పాల్గొన్నారు.

## బీజేపీకి ప్రజలు బుద్ధి చెప్పారు

**శిడ్లఘట్ట, ఏప్రిల్ 29:** గత శాసనసభ ఎన్నికల్లో బీజేపీకి అధికారం దక్కకుండా ప్రజలు బుద్ధి చెప్పారని, దీంతో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రాష్ట్రంపై ద్వేషపూరితంగా వ్యవహరిస్తోందని బెంగళూరు ఉత్తర లోక్‌సభ కాంగ్రెస్ అభ్యర్థి రాజీవ్‌గౌడ ఆరోపించారు. తాలూకాలోని బెళ్యూటి గ్రామంలో కాంగ్రెస్ యువ నాయకుడు, సంతోష్ ఇంటికి వచ్చి కుటుంబీకులను పరామర్శించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ కరువు పరిహారం విడుదలలో కేంద్రం ఇలా వ్యవహరించి ఉండరాదన్నారు. 223 తాలూకాలలో కరువు ఉన్నా పరిహారం కోసం ఇలా వేధించడం సరికాదన్నారు. కేంద్రం తీరుతో విసిగిన రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ఖాళీ చెంబు అభియానతో భయపడిందన్నారు. గత శాసనసభ ఎన్నికల్లో మాదిరిగానే ఈసారి లోక్‌సభ ఎన్నికల్లో కూడా బీజేపీకి గుణపాఠం ఖాయమన్నారు. రాష్ట్రంలో 20-21 సీట్లు కాంగ్రెస్ సాధిస్తుందని జోస్యం చెప్పారు. ప్రకృతి ప్రేమికుడైన బెళ్యూటి సంతోష్ మృతి బాధాకరమన్నారు. అతడు లేని లోటును భరించే శక్తి వారి కుటుంబానికి ఇవ్వాలని దేవుడిని కోరుతున్నట్టు తెలిపారు. ఆయన అకాల మరణం బాధాకరమన్నారు. ఈ సందర్భంగా సమాజసేవకుడు పుట్టు ఆంజినప్ప, కేపీసీసీ నటరాజ్‌గౌడ, ఆనంద్‌ప్రసాద్, నాగేశ్‌గౌడ, కాంగ్రెస్ యువ నాయకుడు రాజకుమార, హొసపేటె శశికుమార్, అనూరు దేవరాజ్, రాజణ్ణ, మునిరాజు, ప్రమోద్ తదితరులు పాల్గొన్నారు.



మీడియాతో రాజీవ్‌గౌడ తదితరులు

## నకిలీ ఔషధాలకు అడ్డుకట్ట వేయండి



మీడియాతో రైతుసంఘం నాయకులు, సభ్యులు

**బంగారపేట, ఏప్రిల్ 29:** పంటల చీడ పీడల నివారణకు ఉపయోగించే మందులు సైతం నకిలీలుగా మారాయని వెంటనే వీటికి అడ్డుకట్ట వేయాలని రైతుసంఘం డిమాండ్ చేసింది. రైతుసంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కే నారాయణగౌడ సోమవారం అంబేడ్కర్ విగ్రహం వద్ద సంఘం సభ్యులతో కలసి మీడియాతో మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్, తమిళనాడులలో నిషేధించిన బయో మందులను సరిహద్దు ప్రాంతం కావడంతో ఇక్కడ విక్రయిస్తున్నారని ఆరోపించారు. నకిలీ ఔషధాలతో రైతులకు అన్యాయం జరుగుతున్నా పట్టించుకోరా అంటూ వాపోయారు. వెంటనే తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇందుకు కొంతమంది కుమ్మక్కయ్యారని ఆరోపించారు. పంటలకోసం వేల రూపాయలు ఖర్చు పెడుతున్నామని అయినా అంగమారి, నుసిరోగం, తదితర రోగాల నియంత్రణలో సమస్యలు ఎదుర్కొంటున్నట్టు తెలిపారు. నకిలీ మందులకు అడ్డుకట్ట వేయాలని డిమాండ్ చేశారు. కొన్ని బహుళ జాతి కంపెనీలకు అధికారులు సైతం గులాంల మాదిరిగా ఉన్నారని అసంతృప్తి వ్యక్తం చేశారు. రైతుసంఘం రాష్ట్ర ప్రముఖుడు మరగల్ శ్రీనివాస్ మాట్లాడుతూ మార్కెట్‌లో అక్రమాలు ఒకవైపు ఉంటే పంటల రోగాలతో రైతులు సమస్యలు ఎదుర్కొంటున్నారన్నారు. వారం రోజుల్లోగా నకిలీలకు అడ్డుకట్ట వేయాలన్నారు. లేనిపక్షంలో తీవ్ర పోరాటం చేస్తామన్నారు. మీడియా సమావేశంలో హసిరుసేన జిల్లా అధ్యక్షుడు కిరణ్, చాంద్‌పాష, అప్పోజిరావ్, ఈకంబళ్ళి మంజునాథ్, మునికృష్ణ, విశ్వ, యల్లప్ప, శైలజ తదితరులు పాల్గొన్నారు.

## వరల్డ్ 10కే విజేతలను అభినందించిన ఉద్యోగులు

**బెంగళూరు, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి):** బెంగళూరు అమెజాన్ ఉద్యోగులు వరల్డ్ 10కే టార్గెట్ సాధకులను తోటి ఉద్యోగులు అభినందించారు. 60మంది ఔత్సాహికులు పది కిలోమీటర్ల పరుగులో భాగస్వామ్యులయ్యారు. వారంతా టార్గెట్‌ను పూర్తి చేసిన మేరకు సోమవారం ప్రత్యేకంగా అభినందించారు. అమెజాన్ ఇండియా వైస్ ప్రెసిడెంట్ మనిష్ తివారితో పాటు ముఖ్యులు పదికిలోమీటర్లు పరుగులు తీసిన వారిని కొనియాడారు. ప్రతి ఒక్కరూ వ్యాయామం, పరుగులో భాగస్వామ్యులు కావాలని తివారీ సూచించారు.



10కిలోమీటర్లు పరుగెత్తిన అమెజాన్ ఉద్యోగులు

### 1909లోనే భారతీయులకు ఓటు హక్కు

**బెంగళూరు, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి):** దేశ స్వాతంత్ర్యం కోసం బ్రిటీష్‌వారిపై భారతీయులు సాగించిన పోరాటంలో ఓటుహక్కు ఉద్యమం ఒకటి. నాటి పాలనలో అంతర్భాగమైన స్థానిక సంస్థలకు 1907లో నిర్వహించిన ఎన్నికల్లో భారతీయులకు ఓటు హక్కు కల్పించాలని ఉద్యమం సాగించారు. దీంతో బ్రిటీష్ ప్రభుత్వం రాయల్ కమిషన్ ఏర్పాటు చేసింది. దాని సిఫార్సుల ఫలితంగా 1909లో జరిగిన కౌన్సిల్ ఎన్నికల్లో కౌన్సిల్ చట్టం ప్రకారం కొద్దిమంది భారతీయులకు ఓటు హక్కు కల్పించారు. అప్పటినుంచి కొనసాగిన ఉద్యమాలతో 1935లో ఓటు హక్కును విస్తృతం చేస్తూ భారతీయుల ఓటు హక్కు శాతాన్ని 10.6శాతానికి పెంచారు. అనంతరం జరిగిన రాజ్యాంగపరిషత్ ఎన్నికల నాటికి 28.5 శాతం ప్రజలకు ఓటు హక్కు వచ్చింది. 1947లో దేశానికి స్వాతంత్ర్యం లభించాక ప్రజాస్వామ్య విధానానికి కట్టుబడి భారత రాజ్యాంగం 326 అధికారణ ప్రకారం 21సంవత్సరాలు నిండిన భారతీయ పౌరులకు ఓటు హక్కు అమలు చేశారు. 1988లో 61వ రాజ్యాంగ సవరణ ద్వారా అప్పటి ప్రధాని రాజీవ్‌గాంధీ ప్రభుత్వం ఓటు హక్కు వయోపరిమితిని 21ఏళ్లనుంచి 18ఏళ్లకు తగ్గించింది.

## వినికిడి సమస్యలకు మెరుగైన చికిత్స

**బెంగళూరు, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి):** వినికిడి సమస్యలతో బాధపడేవారికి అత్యాధునిక శ్రవణయంత్రాలను హియర్ క్లియర్ క్లినిక్ అందుబాటులోకి తెచ్చింది. నగరంలో తన నాల్గోశాఖను ఇటీవల ప్రారంభించింది. 2050 నాటికి మెరుగైన ఆరోగ్యం దిశగా సంస్థ తన కార్యకలాపాలు కొనసాగిస్తోందని నిర్వాహకులు వెల్లడించారు. సంస్థ ఎండీ వినీత్‌నారంగ్ మాట్లాడుతూ ప్రజలకు ఉత్తమ సేవలందించడమే లక్ష్యమన్నారు. ఆధుని శాస్త్ర సాంకేతికతతో వినికిడి ఉపకరణాలు ఉన్నాయన్నారు. సంస్థకు చెందిన జగన్నాథ్‌రావత్ మాట్లాడుతూ స్పీచ్ థెరపీ, వెస్టిబ్యులర్ రిహాబిలిటేషన్, హియరింగ్ ఎయిడ్ ట్ర యల్స్, డిస్పెన్సింగ్ తదితర సేవలు లభ్యమన్నారు. ప్రజలకు మెరుగైన, అత్యా ధునిక సేవలం దించేం దుకు సదా సిద్ధంగా ఉం టున్నట్టు తెలిపారు. స్థానిక ప్రము ఖులు పాల్గొన్నారు.



నూతన సేవలతో సంస్థ నిర్వాహకులు



ఎంపీ శ్రీనివాస ప్రసాద్ భౌతిక కాయం వద్ద నివాళి అర్పిస్తున్న ముఖ్యమంత్రి సిద్ధరామయ్య



నివాళి అర్పిస్తున్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బీవై విజయేంద్ర


## మద్యం మత్తులో.. వరుస వాహనాలు ఢీ



ఘటనాస్థలంలో పోలీసులు

**చింతామణి, ఏప్రిల్ 29:** మద్యం మత్తులో ఉన్న ఒక డ్రైవర్ కారు నడపడంతో వరుస వాహనాలను ఢీ కొని ప్రమాదాలకు కారణమయ్యాడు. పట్టణంలోని పెట్రోల్ బంక్‌లో పనిచేసే సరిహద్దులోని రామసముద్రం ప్రాంతానికి చెందిన చరణ్ ఆదివారం సాయంత్రం మద్యం మత్తులో కారు నడిపాడు. పట్టణంలోని గజానన సర్కిల్ నుంచి శిడ్లఘట్ట రోడ్డు మార్గంలో బాగేపల్లివైపు వెళ్లాడు. తొలుత రోడ్డు పక్కన ఆపిన ద్విచక్ర వాహనాన్ని, ఆటోను ఢీ కొన్నాడు. ఆపై నడిచి వెళ్తున్న వృద్ధురాలు లక్ష్మమ్మను ఢీ కొన్నాడు. అలాగే కారు నిలపకుండా వెళ్లి ఆదర్శ థియేటర్ గోడను ఢీ కొన్నాడు. గాయపడిన పాదచారి లక్ష్మమ్మను ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన చికిత్సకోసం కోలాకు తరలించారు. మరో వ్యక్తి రామాంజి స్వల్ప గాయాలతో చికిత్స పొందుతున్నాడు. ఘటనలో కారు పూర్తిగా దెబ్బతింది. ఆటో, ద్విచక్రవాహనాలు దెబ్బతిన్నాయి. పట్టణ పోలీసులు కారును స్వాధీనం చేసుకుని చరణ్‌ను అరెస్టు చేసి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

## నాసిరకం గుడ్ల సరఫరాపై ఫిర్యాదు



పాడైపోయిన కోడిగుడ్లు

**పావగడ, ఏప్రిల్ 29:** అంగన్‌వాడీ కేంద్రాల్లో పాడై పోయిన గుడ్ల సరఫరాపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తాలూకాలోని 3 నుంచి 6 సంవత్సరాలలోపు పిల్లలకు, గర్భిణీలకు అంగన్‌వాడీ కేంద్రాల్లో అందజేస్తున్న కోడి గుడ్లు, పౌష్టికాహారాల్లో భాగ మైన కోడిగుడ్లు నాసిరకంగా ఉండడంతో పిల్లలు అనారోగ్యం పాలవుతున్నారని భార తీయ పరివర్తన సంఘం జిల్లా అధ్యక్షుడు కెంచరాయ ఆరోపించారు. నిడిగల్లు హోబళిలోని తూమకుంట గ్రామ అంగన్‌వాడీ కేంద్రంలో నాసిరకమైన కోడిగుడ్లు అందజేయడంతో వాటిలో చెడిపోయిన కోడిగుడ్లు ఉండ టం వెలుగులోకి వచ్చింది. ఈనేపథ్యంలో సీడీపీఓ సునీత కు సమాచారం అందించగా ఆమె సంబంధిత అంగన్ వాడీ కేంద్రానికి సూచనలు ఇచ్చి నాణ్యమైన కోడిగుడ్లను అందజేశారు. తక్కువ ధరలకే నాసిరకం కోడిగుడ్లు దొరుకుతుండటం వల్ల కాంట్రాక్టర్లు ఒప్పందం ఏర్పరచుకొని దళారులు ఈఅక్రమ వ్యవహారానికి పాల్పడుతున్నారని ఆయన ఆరోపించారు. స్పందించిన సీడీపీఓ సునీత ప్రతి అంగన్‌వాడీ కేంద్రానికి నోటీసులు జారీచేచేసి మంచి గుడ్లను సరఫరా చేయించారు. చర్యలు చేపట్టడంపై పరివర్తన నాయకులు హర్షం వ్యక్తం చేశారు.




నాణ్యమైన కోడిగుడ్ల అందజేత

## ఆసుపత్రిలో చేరిన ఎస్‌ఎం కృష్ణ

**బెంగళూరు, ఏప్రిల్ 29 (ఆంధ్రజ్యోతి):** మాజీ సీఎం ఎస్‌ఎం కృష్ణ ఆరోగ్యంలో వ్యత్యాసం కనిపించడంతో ఆసుపత్రిలో చేరారు. ఈనెల 22న ఎస్‌ఎం కృష్ణకు జ్వరం, దగ్గు రావడంతో నగరంలోని విఠల్‌మల్యారోడ్డులోని సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిలో చేరారు. కొంతమేర కోలుకోవడంతో డిశ్చార్జ్ అయ్యారు. మరోసారి సోమవారం ఆయన ఆరోగ్యంలో మార్పు రావడంతో హెచ్‌ఏఎల్ రోడ్డులోని ఓ ప్రముఖ ఆసుపత్రికి తరలిం చారు. ఎస్‌ఎం కృష్ణ వయసు ప్రస్తుతం 91 ఏళ్లు కాగా వయోభారం సమస్యలతో ఇబ్బంది పడుతున్నారు. ప్రస్తుతానికి ఆయన ఆరోగ్యం నిలకడగా ఉందని వైద్యులు తెలిపారు.







## తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

| | ప్రస్తుతం | గత ఏడాది |
|---|---|---|
| నీటి మట్టం (అడుగులు) | 1,578.22 | 1,575.97 |
| ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు) | 000 | 000 |
| ఔట్ ఫ్లో (క్యూసెక్కులు) | 260 | 251 |
| సామర్థ్యం (టీఎంసీలు) | 3.67 | 2.81 |

### ఓటుపై అవగాహన



ఓటర్ల అవగాహనలో పాల్గొన్న పంచాయతీ అధికారులు

**బళ్లారి సిటీ, ఏప్రిల్ 29:** ఓటు వేయడం పౌరుల ప్రథమ కర్తవ్యమని అర్హులైన ఓటర్లు తప్పకుండా ఓటు వేయాలని జిల్లాపంచాయితీ ముఖ్య ప్రణాళిక అధికారి వాగీష్ శివచార్యులు తెలిపారు. జిల్లాస్వీప్ కమిటీ ఆధ్వర్యంలో నగరంలోని ఏపీఎంసీ మార్కెట్ ఏరియాలో సోమవారం నిర్వహించిన ఓటింగ్‌పై అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. మే 7న జరిగే లోక్‌సభ ఎన్నికల్లో ప్రతి పౌరుడు పాల్గొనాలన్నారు. బళ్లారి తాలూకా స్వీప్ నోడల్ అధికారి టీఏఎంపీ కార్యనిర్వహణాధికారి మాదగిన చన్నబసప్ప మాట్లాడుతూ మే 7న ఎలాంటి భ్రమలు లేకుండా ఓటు వేయాలన్నారు. ఈసందర్భంగా జిల్లా తాలూకా పంచాయితీ సిబ్బంది, ఏపీఎంసీ మార్కెట్ సిబ్బంది పాల్గొన్నారు.

### కాంగ్రెస్ గ్యారెంటీ కార్డుల పంపిణీ



గ్యారెంటీ కార్డులను పంపిణీ చేస్తున్న శ్రీనివాసులు

**బళ్లారి సిటీ, ఏప్రిల్ 29:** బళ్లారి నగరంలోని 35వ వార్డు రాజేశ్వరీ నగర్‌లోవార్డు సభ్యులు వి.శ్రీనివాసులు హంపి మహేశ్వర దేవస్థానం, మౌలాలీ దర్గా ఆశీర్వాదం తీసుకుని బళ్లారి నగర ఎమ్మెల్యే భరత్‌రెడ్డి ఆదేశం ప్రకారం సోమవారం కాంగ్రెస్ గ్యారెంటీ కార్డులను ఇంటింటికి వెళ్లి పంపిణీ చేశారు. ఈసందర్భంగా వార్డులోని కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

### రథోత్సవంలో అపశృతి

● రథచక్రాల కింద నలిగిన భక్తులు

● మూడుకు చేరిన మృతుల సంఖ్య

**బళ్లారి గాంధీనగర్, ఏప్రిల్ 29:** విజయపుర జిల్లా ఇండి తాలూకా లాచ్యాణ గ్రామంలోని కమరిమఠం జాతర ఉత్సవంలో ఆదివారం అపశృతి చోటుచేసుకుంది. సాయంత్రం వేలాది మంది భక్తుల మధ్య రథోత్సవం సాగుతుండగా, రథం చక్రాల క్రింద చిక్కుకుని ఏడుగురు గాయపడ్డారు. తీవ్రంగా గాయపడిన వారిలో ఘటనా స్థలంలోనే ఇద్దరు మృతి చెందగా, మరొకరు తీవ్రంగా గాయపడి ఆసుపత్రిలో మృతి చెందాడు. దీంతో ఘటనలో మృతుల సంఖ్య ముగ్గురికి చేరుంది. ఈ ఘటన ఇండి గ్రామీణ పోలీసు స్టేషన్ వ్యాప్తిలో చోటుచేసుకుంది మృతిచెందిన వారిని సురేష్ కటకదొండ(36), అభిషేక్ ముజగొండా(17), సోబు శింధా(51)గా పోలీసులు గురించారు. ఈ మేరకు ఇండి గ్రామీణ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేసున్నారు.


### మహిమాన్వితురాలు సజ్జలగుడ్డ శరణమ్మ



పురాణ పఠనం ప్రారంభిస్తున్న కళ్యాణ స్వాములు

**సిరుగుప్ప, ఏప్రిల్ 29:** సజ్జలగుడ్డ శరణమ్మ మహిమాన్వితురాలని కళ్యాణస్వాములు తెలిపారు. సోమవారం సిరుగుప్ప తాలుకా పరిధిలో ఎరకల్లు గ్రామంలో సజ్జలగుడ్డ శరణమ్మ జీవిత చరిత్ర, పురాణ పఠన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమాన్ని కళ్యాణ స్వాములు జ్యోతి వెలిగించి ప్రారంభించి మాట్లాడారు. ఆదోని లక్ష్మమ్మ అవ్వ, టెక్కలకోట తాడె సిద్దప్ప ఎంతో మహిమాన్వితులని ఆయన తెలిపారు. ఆ బాటలో సజ్జలగుడ్డ శరణమ్మ ఒకరని ఆయన తెలిపారు. శరణుల తత్వసిద్దాంతాలను పాటించాలని ఆయన కోరారు.

# రైతు రుణాల మాఫీ ఖాయం



జ్యోతి వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ముఖ్యమంత్రి

● ఖాళీ చెంబును శ్రీరాములుకు తిరిగిచ్చేయండి ● కూడ్లిగి సభలో ముఖ్యమంత్రి సిద్దరామయ్య

**బళ్లారి గాంధీనగర్, ఏప్రిల్ 29:** మరోసారి మోదీ ప్రధాని అయితే దేశంలో ప్రజలకు చెంబు మినహా మరేమి మిగలదని ముఖ్యమంత్రి సిద్దరామయ్య అన్నారు. బళ్లారి కాంగ్రెస్ అభ్యర్థి తుకారాం విజయం కోసం సోమవారం కూడ్లిగి పట్టణంలో ఏర్పాటు చేసిన ప్రజాధ్వని-2 సమావేశాన్ని ప్రారంభించి ఆయన మాట్లాడారు. శ్రీరాములు బళ్ళారి ప్రజలకు ఇచ్చిన చెంబును అతడికి వాపస్ ఇవ్వాలని కూడ్లిగి ఓటర్లకు సలహా ఇచ్చారు. మోదీ ఓటమి ఖాయమైపోయిందని, బీజేపీ మళ్ళీ అధికారికి రావడం కష్టమని తేలిపోయిందన్నారు. ఆక్సిస్ ప్రకటించిన నిజమైన సమీక్షలను మోదీ డిలీట్ చేయడానికి ఓటమి భయమే కారణమన్నారు. ఓటమి ఖాయమని తెలిసీ, అబద్ధాలను సృష్టించి భారతీయుల నడుమ చిచ్చు పెట్టే ప్రయత్నం చేస్తున్నారన్నారు. రిజర్వేషన్ విషయంపై మాట్లాడుతూ, ముస్లింలకు వ్యతిరేకంగా రూపొందించిన స్కెచ్‌ను విఫలం చేయాలని పిలుపునిచ్చారు. కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తరువాత మహిళల ఖాతాల్లో ఏడాదికి ఒక లక్ష రూపాయలు పడుతాయని, నిరుద్యోగుల ఖాతకు ఒక లక్ష రూపాయలు జయ అవతాయన్నారు. దేశమంతా రైతుల రుణాలు మాఫీ చేస్తామని సిద్దరామయ్య హామీ ఇచ్చారు. కాంగ్రెస్ పాలనలో మన్మోహన్ సింగ్ ప్రధానిగా ఉన్న సమయంలో దేశంలో 76వేల కోట్ల రూపాయల రుణాల మాఫీ చేశారన్నారు. అయితే మోదీ, అంబాని, అదాని లాంటి ఆగర్బ శ్రీమంతులకు 16లక్షల కోట్ల రూపాయలు రుణ మాఫీ చేశారన్నారు. రైతుల రుణాల మాఫీ చేడానికి అంగీకరించని మోదీ ఎవరికి మద్దతుగా ఉన్నారనే విషయం ప్రజలకు తెలిసిపోయిందన్నారు. బళ్ళారి లోక్‌సభ నియోజకవర్గంలో కాంగ్రెస్ అభ్యర్థి తుకారాంను ఆశీర్వదించాలని ఓటర్లకు మనవి చేశారు. కార్యక్రమంలో కెపిసిసి అధ్యక్షులు డిసిఎం డి.కె.శివకుమార్, మంత్రి జమీర్ అహ్మద్ ఖాన్, రామలింగారెడ్డితోపాటు విజయనగర, బళ్లారి జిల్లా ఎమ్మెల్యేలు, జిల్లా తాలూకా బ్లాక్ కాంగ్రెస్ ప్రముఖులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అందరూ తుకారాం గెలుపుకు కృషి చేస్తామని శపథం చేశారు.

**ఎమ్మెల్యేగా గెలవలేని శ్రీరాములు ఎంపీగా పోటీచేస్తారా?**

**బళ్లారి, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి):** మాజీ మంత్రి శ్రీరాములును ఎమ్మెల్యేగానే ప్రజలు తిరస్కరించారని, ఎంపీగా ఎలా ఎన్నుకుంటారని ముఖ్యమంత్రి సిద్దూ రామయ్య విమర్శించారు. బీజేపీ ప్రభుత్వం కేంద్రంలో అధికారంలో ఉండి రాష్ట్ర రైతుల కోసం చేసిన మేలు ఏమిలేదన్నారు. కర్ణాటక రైతులకోసం రూ.18.172కోట్లు పరిహారం అడిగితే రూ.3454కోట్లు ఇచ్చి చేతులు దులుపుకుందని మండిపడ్డారు. ఎమ్మెల్యే ఎన్నికల ముందు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకుఇచ్చిన హామీలను నెరవేర్చిందన్నారు. కాంగ్రెస్ అభ్యర్థి తుకారంను గెలిపించాలన్నారు. ఈ సభలో బళ్లారి లోక్‌సభ అభ్యర్థి తుకారం, మంత్రులు రామలింగారెడ్డి, జమీర్ అహమ్మద్, ఎమ్మెల్యేలు గోపాలకృష్ణ, శ్రీనివాస్, ఎంపి లతా మల్లికార్జున, భీమా నాయక్, పరమేశ్వర నాయక్, గణేశ్, కాంగ్రెస్ జిల్లాధ్యక్షుడు శివయోగి, సిరాజ్ షేక్ పాల్గొన్నారు.





సీఎం సిద్దూ, డీసీఎంను గజమాలతో సత్కరిస్తున్న అభిమానులు

## మోదీ పచ్చి అబద్ధాలకోరు

● కుష్టిగిలో సీఎం సిద్దూ విమర్శ

**బళ్లారి గాంధీనగర్, ఏప్రిల్ 29:** మోదీని పచ్చి అబద్దాల కోరుగా సిద్దరామయ్య అభివర్ణించారు. కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తే సంవత్సరానికి ఒక ప్రధానిని మారుస్తారనే చెప్పడం మోదీకే చెల్లుతుందని ముఖ్య మంత్రి సిద్దరామయ్య అన్నారు. రాష్ట్రంలో 2008-2013 అవధిలో ముగ్గురు ముఖ్యమంత్రులను మార్చిన ఘనత బీజేపీకే దక్కుతుందని.. ఈ విషయం తెలుసుకుని మాట్లాడాలని సిద్దరామయ్య హితవు పలికారు. లోక్‌సభ ఎన్నికల ప్రచారం కార్యక్రమంలో భాగంగా సోమవారం కొప్పళ జిల్లా పరిధిలోని కుష్టిగిలో జరిగిన ఎన్నికల ప్రచార కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. కాంగ్రెస్ పార్టీలో మల్లికార్జున ఖర్గే, రాహుల్ గాంధీతోపాటు అనేకమంది సీనియర్ నాయకులు ఉన్నారన్నారు. తానొక్కడే పూర్తికాలం సీఎం కొనసాగానని, ఈ విషయం ప్రధాని మోదీ గుర్తెరగాలన్నారు.

## ఎన్నికలకు ఎండ దెబ్బ



**కంప్లి, ఏప్రిల్ 29 :** లోక్‌సభ ఎన్నికలకు ఎండ తీవ్రత పెద్ద గండంగా మారింది. రోజురోజుకు ఎండలు పెరిగిపోతుండటంతో ఎన్నికల్లో పోలింగ్ శాతం అంతంత మాత్రంగానే ఉండేటట్లు కనిపిస్తోంది. జిల్లాలో అధికారులు స్వీప్ కమిటీలు ఏర్పాటు చేసి ఎన్నో జాగృతి కార్యక్రమాలు చేపడుతున్నారు. క్రీడలు, ముగ్గుల పోటీలు, భరత నాట్యం, ర్యాలీ, చేపడుతూ ఎన్నికల్లో ఓటింగ్ శాతం పెరిగేందుకు ఎన్నో విధాలుగా కృషి చేస్తున్నారు. గత రెండు, మూడు రోజులుగా 40 డిగ్రీలకుపైగా ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఉదయం 8 గంటల నుంచే ఎండలు ప్రారంభమవుతాయి. సాయంత్రం 6 గంటల వరకు ఎండవేడిమి వుంటోంది. ఈ ఎన్నికలు మాత్రం 7.30 నుంచి ప్రారంభమై 5 గంటల వరకు జరుగుతాయి. ఈ ఎండల్లో ఓటు వేయడానికి రావాలన్నా ప్రజలు మొగ్గు చూపడం కష్టంగా వుంది. ఆయా పార్టీల నాయకులు ప్రచారాలు చేపడుతున్నా ఎండల ప్రభావంతో పోలింగ్ శాతం తగ్గే అవకాశం వుంది. అధికారులు అనుకున్నంత స్థాయిలో పోలింగ్ శాతం నమోదయ్యే అవకాశం తక్కువని అంటున్నారు.

### ఓఆర్ఎస్‌తో వడదెబ్బ నివారణ

**బళ్లారి సిటీ, ఏప్రిల్ 29:** జిల్లాలో ఎండలు తీవ్రంగా ఉన్న నేపథ్యంలో వృద్దులు, చిన్నారులు, గర్భిణులు బయటకు వెళ్లకుండా వడదెబ్బ తగలకుండా చేయి చేయి కలపాలని జిల్లా ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ అధికారి డాక్టర్ రమేశ్‌బాబు కోరారు. సోమవారం నగరంలో వేసవినుంచి ఉపశమనం పొందడానికి ఓఆర్ఎస్ పౌడర్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ గత కొన్నేళ్లతో పోలిస్తే ప్రస్తుతం ఎండ విపరీతంగా ఉందన్నారు. రానున్న కొద్దిరోజులుగా వేడి గాలులు వీస్తాయని రాష్ట్ర వాతావరణ శాఖ ఇప్పటికే హెచ్చరికలు జారీ చేయడంతో పాటు బళ్లారి జిల్లాలో డీహైడ్రేషన్ నివారణకు ఆరోగ్యకేంద్రాల్లో ఓఆర్ఎస్ పౌడర్‌ను అందించేందుకు ఏర్పాట్లు చేసిందన్నారు. ఒక లీటరు నీటిలో ఒక ప్యాకెట్ పౌడర్‌ను వేసి 24గంటలలోపు తాగడం ద్వారా సూర్యరశ్మి వల్ల ఏర్పడే డీహైడ్రేషన్‌ను నివారించవచ్చన్నారు. లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో జిల్లా సరిహద్దుతోపాటు ఇతర ప్రాంతాల్లో ప్రారంభించిన 24చెక్ పోస్టుల సిబ్బందికి ఓఆర్ఎస్ ప్యాకెట్లు అత్యవసర మందులను పంపిణీ చేశామన్నారు. మధ్యాహ్న సమయంలో అవసరమైతే ఇంటి నుంచి బయటకు కెళ్లే సమయంలో ప్రజలు స్వచ్ఛమైన తాగునీరు తీసుకు వెళ్లాలన్నారు.

### లైంగిక దాడులకు పాల్పడేవారికి బీజేపీ మద్దతు: ప్రకాష్‌రాజ్ విమర్శ



మాట్లాడుతున్న సినీ నటుడు ప్రకాష్‌రాజ్

**బళ్లారి, ఏప్రిల్ 29(ఆంధ్రజ్యోతి):** స్వలింగ సంపర్కులు, మహిళలను లైంగికంగా వేధించినవారు, అవినీతిపరులు, దొంగలకు బీజేపీ అండగా నిలుస్తోందని సినీనటుడు ప్రకాష్‌రాజ్ విమర్శించారు. రెండువేల మంది మహిళలను లైంగికంగా వేధించిన మాజీ ప్రధాని దేవెగౌడ మనవడు, ఎంపీ ప్రజ్వల్ రేవణ్ణ గురించి బీజేపీ ఎందుకు మాట్లాడటం లేదని ఆయన ప్రశ్నించారు. హసన్ ఎంపీ ప్రజ్వల్ రేవణ్ణపై లైంగిక వేధింపుల కేసు నమోదైందని, ఆయన అరెస్టు కాకుండా విదేశాలకు పారిపోయారని, అలాంటి నాయకులున్న పార్టీలతో బీజేపీ జతకట్టి.. సమాజానికి ఏం సందేశం ఇస్తుందని ప్రశ్నించారు. ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించి.. మహిళలు చెడిపోయేందుకు కాంగ్రెస్ పార్టీ అవకాశం ఇస్తోందని గతంలో హెచ్‌డీ కుమారస్వామి ఒక సభలో వ్యాఖ్యానించారని గుర్తు చేశారు. తన అన్న కుమారుడు ప్రజ్వల్ రేవణ్ణ ఏకంగా రెండు వేల మంది మహిళలను లైగింకంగా హింసించారని, దీనిపై కుమార స్వామి ఎందుకు మాట్లాడడం లేదని ప్రశ్నించారు. తప్పులు చేసిన వారిని చూస్తూ సమాజం మౌనంగా ఉంటే అది సమాజానికి తీరని నష్టం కలగజేస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. సమాజానికి సమస్య వచ్చినప్పుడు నోరు విప్పడానికి ఎన్నికల సమయంలో ముందుకు వచ్చానని, ఆరునెలల పాటు షూటింగ్‌లు మానుకుని ప్రజల కోసం వచ్చానని అన్నారు. ప్రస్తుతం దేశంలో బీజేపీకి ప్రత్యామ్నాయం ఏ పార్టీ ఉందని అడిగిన ఓ విలేకరిపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. 'ఆ మహానుభావుడు దేశానికి ఏం చేశాడు..?' అని ప్రధాని మోదీనుద్దేశించి అన్నారు. ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి మద్దతు ఇవ్వాలని కోరారు.

### మైక్రో అబ్జర్వర్లకు ఎన్నికల శిక్షణ

**బళ్లారి సిటీ, ఏప్రిల్ 29:** బళ్లారి లోక్‌సభ నియోజకవర్గ ఎన్నికలకు సంబంధించి మే 7న పోలింగ్ జరుగుతుందని, ఇప్పటికే గుర్తించిన మైక్రో పోలింగ్ కేంద్రాల్లో స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా ఎన్నికలు నిర్వహించడంలో మైక్రో అబ్జర్వర్ల పాత్ర ముఖ్యమని సాధారణ ఎన్నికల పరిశీలకులు చంద్రశేఖర్ శాఖమూరి తెలిపారు. సోమవారం మైక్రో పోలింగ్ కేంద్రాలుగా గుర్తించి ఒక్కో పోలింగ్ కేంద్రానికి ఒక మైక్రో అబ్జర్వర్‌ను నియమించారు స్వేచ్ఛగా నిష్పక్షపాతంగా ఎన్నికలు నిర్వహించడమే వీరి ఉద్దేశ్యమన్నారు. మే 7న ఉదయం ఆరు గంటలకు పోలింగ్ ప్రారంభించి ప్రతి పోలింగ్ కేంద్రంలో జరిగే ప్రతి దశను నిశితంగా పరిశీలిస్తారన్నారు. పోలింగ్ ముగిసే వరకు ఊహించాల్సి ఉందన్నారు. ఎన్నికల ప్రతి దశను డాక్యుమెంట్ చేయడంలో వారు ముఖ్యమైన పాత్ర పోషించాలన్నారు. శిక్షణలో డిప్యూటీ కలెక్టర్ మహ్మద్ జుబేర్‌తోపాటు వివిధ నోడల్ అధికారులు పాల్గొన్నారు. బళ్లారి జిల్లాలోని అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల నుంచి 396 మంది మైక్రో అబ్జర్వర్లు ఎన్నికల శిక్షణకు హాజరైయ్యారు.

## వైభవంగా చిదానంద స్వాముల రథోత్సవం

**కంప్లి, ఏప్రిల్ 29 :** కురుగోడు తాలుకా పరిధిలోని సోమలాపురం చిదానందప్ప స్వాముల రథోత్సవం సోమవారం కన్నుల పండువగా జరిగింది. ఉదయం నుంచి సాయంత్రం వరకు మఠంలో వివిధ ధార్మిక కార్యక్రమాలు జరిగాయి. సాయంత్రం ఆలయం నుంచి ఎదురు బసవన్న కట్ట వరకు రథాన్ని లాగారు. ఈ రథోత్సవ కార్యక్రమంలో వీరాపురం, ముష్టిగట్టి, కురుగోడు, శిరిగేరి, కంప్లి, బళ్లారి తదితర గ్రామాలు పట్టణాల నుంచి భక్తులు పాల్గొని చిదానందప్ప స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. రథోత్సవంలో ఫూలు, పండ్లతో మొక్కులు సమర్పించారు. ఎలాంటి సంఘటనలు జరుగకుండా కురుగోడు ఎస్ఐ సుప్రీత్ బందోబస్తు నిర్వహించారు.



సోమలాపురంలో సాగుతున్న చిదానందప్ప స్వామి రథోత్సవం



### సిటీ ఎమ్మెల్యే భరత్ రెడ్డి విస్తృత ప్రచారం

**బళ్లారిరూరల్, ఏప్రిల్ 29 :** బళ్లారి నగరంలోని 3వ వార్డు, బండిమోటు, తదితర వార్డుల్లో సిటీ ఎమ్మెల్యే భరత్ రెడ్డి, స్థానిక కార్పొరేటర్లు ప్రభంజన్, బీఆర్ఎల్ శీన, పలు వార్డుల్లో కాంగ్రెస్ అభ్యర్థి తుకారామ్ గెలుపు కోసం ప్రచారం చేశారు. ఈ సందర్భంగా సిటీ ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వ హయాంలో బళ్లారి నగరంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామన్నారు. కనకదుర్గమ్మ ఆలయ అభివృద్ధితో పాటు రూ. 120 కోట్లు నిధులు ప్రభుత్వం ద్వారా మంజూరు చేయించి నగరంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని కావున కాంగ్రెస్ హస్తం గుర్తుకు ఓటు వేసి లోక్‌సభ అభ్యర్థి తుకారామ్‌ను గెలిపించాలన్నారు. ఈ కార్యక్రమంలో ముండ్లూరి వివేక్, బోయపాటి విష్ణువర్ధన్, రాజేశ్వరి సుబ్బరాయుడు, శోభ, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు హుస్సేన్ పీరా, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ప్రచారంలో పాల్గొన్నారు.

## హోసూరు జోన్

### హోసూరులో ఐదుచోట్ల చలివేంద్రాలు



చలివేంద్రంలో తాటిముంజలు, పుచ్చకాయల పంపిణీ

**హోసూరు(సిప్‌కాట్), ఏప్రిల్ 29:** డీఎంకే రాష్ట్ర అధ్యక్షుడు, తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్, క్రీడాశాఖ మంత్రి ఉదయనిధి సూచనలతో హోసూరులో చలివేంద్రాలు ఏర్పాటు చేశారు. ప్రస్తుత వేసవిలో దాహార్తి తీర్చేలా డీఎంకే చర్యలు చేపట్టింది. హోసూరు మున్సిపల్ డిప్యూటీ సెక్రటరీ గోపాలకృష్ణన్ ఆధ్వర్యంలో సోమవారం హోసూరు రైల్వేస్టేషన్ సమీపాన చలివేంద్రాన్ని ప్రారంభించారు. బస్టాండ్, రైల్వేస్టేషన్, రైతుబజారు సహ ఆ ప్రాంతంలో ప్రజలు గుమిగూడే 5 చోట్ల చలివేంద్రాలను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పుచ్చకాయలు, కీరదోస, పుచ్చకాయలు, నీరు మజ్జిగ, పానీయాలు అందించారు. ఎమ్మెల్యే వైప్రకాశ్, మేయర్ సత్య పాల్గొని స్వయంగా వీటిని అందజేశారు. హోసూరులో జిల్లా కార్యదర్శులు హోసూరు రైల్వేస్టేషన్ టీవీఎస్ నగర్, రైతు బజార్, బస్టాండ్, ఆవలపల్లి హడ్కోలలో చలివేంద్రాలను ప్రారంభించారు. మాజీ ఎమ్మెల్యే మురుగన్, కార్యవర్గ ఛైర్మెన్ ఎల్లోరమణి, డిప్యూటీ మేయర్ ఆనందయ్య, జిల్లా యూత్ సుమన్, నగర యూత్ కలైచెళియన్, శ్రీనివాసన్, ఏరియా కార్యదర్శులు తిమ్మరాజ్. రాము, వెంకటేశ్, మాణికం, సతీశ్, మహేశ్వరీ, సత్య నారాయణ, సౌరి ముత్తు, ఈటేశ్, సూర్య తదితరులు పాల్గొన్నారు.

### మహిళ ఆత్మహత్య

**హోసూరు(క్రైం), ఏప్రిల్ 29:** హోసూరు చెన్నత్తూరులోని సీతారమా నగర్‌కు చెందిన మునిరత్నమ్మ (48) అనారోగ్య సమస్యలతో బాధపడుతూ పలు ఆసుపత్రుల్లో చికిత్స చేయించుకున్నా కోలుకోలేదు. దీంతో మనస్తాపానికి గురైన ఆమె ఆత్మహత్యకు పాల్పడింది. గమనించిన బంధువులు ఆమెను హోసూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అనంతరం కృష్ణగిరి ప్రభుత్వ వైద్య కళాశాల ఆసుపత్రికి మార్పు చేశారు. అయినప్పటికీ చికిత్స ఫలించక మునిరత్నమ్మ మృతి చెందింది. ఈమేరకు హోసూరు టౌన్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

### పాఠశాలలో ఉచిత వైద్యశిబిరం

**హోసూరు, ఏప్రిల్ 29:** హోసూరు సిప్‌కాట్ అరిమా సంఘ బ్లడ్ బ్యాంక్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. డాక్టర్ వెన్నెల పద్మనాభన్, హోసూరు సిప్‌కాట్ అరిమా సంఘం సంయుక్తంగా సోమవారం శిష్ పాఠశాలలో ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించారు. హోసూరు గుణం హాస్పిటల్ ఎండీ, ఇండియన్ మెడికల్ అసోసియేషన్ హోసూరు శాఖ అధ్యక్షుడు డాక్టర్ సెందిల్ మాట్లాడుతూ హోసూరు సిప్‌కాట్ అరిమా సంఘ బ్లడ్ బ్యాంక్ యూనిట్ రక్తాన్ని రూ.900గా నిర్ణయించామని, ప్రభుత్వం రూ.1450కి సూచించినా సాధారణ ప్రజలకు తక్కువ ధరకే రక్తాన్ని అందుబాటులో ఉంచినట్టు తెలిపారు. శిబిరంలో గుణం ఆసుపత్రి వైద్యురాలు ప్రదీప్, వైద్యురాలు కవితా సెందిల్, వనిత ప్రదీప్, హోసూరు ప్రభుత్వాసుపత్రి ముఖ్య వైద్యురాలు జ్ఞాన మీనాక్షి అరిమా సంఘం అధ్యక్షుడు రమేశ్‌బాబు, రవివర్మ నంబి, జనకర్ తదితరులు పాల్గొన్నారు.



శిబిరంలో పాల్గొన్న నిర్వాహకులు

## బీజేపీ అబద్ధాలు, కాంగ్రెస్ నిజాయతీకి మధ్య పోరు..!



మాట్లాడుతున్న మాజీ మంత్రి తన్వీర్ సేఠ

**రాయచూరు, ఏప్రిల్ 29 :** గడచిన 10 ఏళ్లలో బీజేపీ చెబుతున్న అబద్దాలకు కాంగ్రెస్ నిజాలకు మధ్య ప్రస్తుత ఎన్నికలు పోరాటంఅని మాజీ మంత్రి తన్వీర్ సేఠ అన్నారు. సోమవారం నగరానికొచ్చిన ఆయన డీసీసీ కార్యాలయంలో విలేఖరులతో మాట్లాడారు. 2014లోక్‌సభఎన్నికల సందర్భంగా నరేంద్ర మోదీ దేశ ప్రజలకు ఇచ్చిన ఏ ఒక్క హామిని నెరవేర్చలేక మూడవ సారి అధికారం కావాలంటూ ప్రజలను వివిధ రకాలుగా మభ్య పెట్టే ప్రయత్నం చేస్తుండడం హాస్యాస్పదమన్నారు. నరేంద్రమోదీ హయాంలో దేశంలో ఒక జాతీయ స్థాయి విద్యసంస్థ లేదా ఒక జాతీయ స్థాయిలో పబ్లిక్ రంగ సంస్థ ఏర్పాటు కాలేదని దేశ ఆర్థిక పురోగతి అంకెలకు మాత్రమే పరిమితమైందన్నారు. గడచిన 50 ఏళ్లలో ఏ ప్రభుత్వం చేయనంత అప్పును నరేంద్ర మోదీ ప్రభుత్వం చేసిందన్నారు.

### మతం పేరుతో ఓట్లడగడం సిగ్గుచేటు: సీఎం సిద్దూ

**రాయచూరు, ఏప్రిల్ 29 :** సరిగ్గా 10 ఏళ్ల క్రితం గుజరాత్ మోడల్ అంటు ప్రజలను ఉదరగొట్టి అధికారం లోకొచ్చిన నరేంద్ర మోదీ ప్రధానిగా 10 ఏళ్ల పాటు దేశానికి చేసిందేమిలేదని ముఖ్యమంత్రి సిద్దరామయ్య ఎద్దేవా చేశారు. ఆయన మాటలకి ఆచరణకు ఉన్న వ్యత్యాసాన్ని ప్రజలు గ్రహించారని ఆయన నిజస్వరూపం ఇప్పటికే ప్రజల ముందు బట్టబయలైందని స్పష్టం చేశారు. కొప్పళ అభ్యర్థి రాజశేఖర్ హిట్నాళ్ తరఫున ముఖ్యమంత్రి సిద్ధరామయ్య ఆదివారం రాత్రి సింధనూరు జైన్ కళాశాల మైదానంలో ఎన్నికల బహిరంగ సభలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడిన సిద్ధరామయ్య, గడచిన 10 ఏళ్లలో దేశానికి చేసిందేమి లేదన్న విషయం అందరికంటే మోదీకే బాగా తెలసన్నారు. అందుకే అభివృద్ధి గురించి కాకుండా లోక్‌సభ ఎన్నికల్లో మతం పేరుతో దేవుళ్ల పేరుతో రిజర్వేషన్ల పేరుతో ప్రజల ఓట్లను అడుగుతున్నారని ఇది ఆయన స్థాయికి తగదన్నారు. 200 సీట్లు కూడా రావన్న విషయం నరేంద్ర మోదీకి తెలిసి పోయిందని ఎన్నో చోట్ల లోకసభ అభ్యర్థులను మార్చినా పార్టీ గడ్డెక్కే పరిస్థితి లేదని తెలియడం వల్లే కాంగ్రెస్ పై నిందారోపణలు చేస్తున్నారన్నారు.